

జిల్లా అధికారులపై

- ఏపీలో అత్యధికంగా చంద్రగిరి, తిరుపతి నుంచే ఫిర్యాదులు

ఈసీ సీరియస్

ఇన్ని ఫిర్యాదులు వస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?

ధోరణి మార్చుకోకుంటే తీవ్ర చర్యలు

తిరుపతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో మంగళవారం ఓటర్ల జాబితా సవరణలపై సమీక్షించిన కేంద్ర ఎన్నికల సంఘం జిల్లా అధికారులపై సీరియస్ అయింది. విపరీతంగా ఫిర్యాదులు వస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీసింది. ధోరణి మార్చుకోకుంటే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించింది. విజయవాడలో మంగళవారం రాష్ట్రంలో జిల్లాల వారీగా ముఖ్య అధికారులతో ఎన్నికల సంఘం కమిషనర్లు సమీక్ష నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు తిరుపతి జిల్లాపైనే ప్రధానంగా ఎన్నికల సంఘం దృష్టి సారించింది. రాష్ట్రంలోనే అత్యధికంగా తిరుపతి జిల్లా నుంచే ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని, దీనికి కారణాలేమిటని ప్రశ్నించింది. చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల నుంచీ విపరీతంగా ఫిర్యాదులు అందుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీసింది. అనర్హుల ఓట్లు తొలగించాలని ప్రతిపక్ష పార్టీల నుంచీ అభ్యంతరాలు అందితే ఎందుకు పరిశీలించడం లేదని ప్రశ్నించింది. అభ్యంతరాలలో పేర్కొన్న పేర్లు డ్రాఫ్ట్ జాబితాలో మళ్ళీ కొనసాగుతుండడం పట్ల విస్మయం వ్యక్తం చేసింది. ఇదే ధోరణితో వుంటే ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యాక తీవ్ర చర్యలు వుంటాయని హెచ్చరించింది. చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల్లో వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాల మీద గడువు లోగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి తదితర నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాలో అవకతవకల గురించి ఆయా నియోజకవర్గాల నుంచీ అందిన అసంఖ్యాక ఫిర్యాదులతో గత నెలలో సమీక్షించినపుడే ఎన్నికల సంఘం జిల్లా అధికార యంత్రాంగాన్ని స్పష్టంగా హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఇపుడు ఏకంగా టీడీపీ, జనసేన పార్టీల అధ్యక్షులు చంద్రబాబు , పవన్ కళ్యాణ్‌లే నేరుగా ఫిర్యాదు చేయడంతో కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించినట్టు సమాచారం. దానికి తోడు ఎన్నికల కమిషన్ రాష్ట్రానికి వచ్చిన సమయంలోనే చంద్రగిరి టీడీపీ ఇంచార్జి పులివర్తి నానీ ఓటర్ల నమోదులో అక్రమాలపై ఆమరణ నిరాహార దీక్షకు దిగడం, పోలీసులు అడ్డుకోవడంతో పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు యత్నించడం వంటి ఘటనలు కమిషన్ దృష్టికి వెళ్ళాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం మంగళవారం జరిపిన సమీక్షలో అధిక సమయం తిరుపతి జిల్లాకే కేటాయించి లోతుగా వివరాలు రాబట్టినట్టు సమాచారం. ఆ క్రమంలో జిల్లా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. గడువులోగా చంద్రగిరి, తిరుపతి సెగ్మెంట్లలో అందిన అభ్యంతరాలు, ఫిర్యాదులపై జిల్లా యంత్రాంగం ఏ మేరకు చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సి వుంది. ఒకవేళ చర్యలు తీసుకోవడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తే మాత్రం తీవ్ర మూల్యం చెల్లించాల్సి వుంటుందని జిల్లా ఉద్యోగ, అధికార వర్గాలు భావిస్తున్నాయి.

దొంగ ఓట్లు తొలగించరెందుకు?

ఆధార్‌తో అనుసంధానం చేసి గందరగోళానికి తెరదించండి

తిరుపతిలో టీడీపీ, జనసేన ఆందోళన



తిరుపతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నియోజకవర్గంలో దొంగ ఓట్లను తొలగించాలని ఆధారాలతో సహా ఎన్నికల అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా ఫలితంలేకుండా పోతోందని టీడీపీ, జనసేన నాయకులు మండిపడ్డారు. దొంగ ఓట్ల తొలగింపులో మౌనం దాల్చుతున్న అధికారుల తీరును నిరసిస్తూ మంగళవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట టీడీపీ, జనసేన నాయకులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహ యాదవ్, నియోజకవర్గ పరిశీలకుడు సురేంద్ర కుమార్ మాట్లాడుతూ.. ముసాయిదా ఓటరు జాబితాలో గందరగోళంగా మార్పులు, చేర్పులను చేశారన్నారు. చనిపోయినవారి, నగరం నుంచి వెళ్లిపోయినవారి పేర్లను బీఎల్వోల సమక్షంలో గుర్తించి ఫిర్యాదు చేసినప్పటికీ ఇంకా వారు ఓటర్లుగా కనిపిస్తున్నారన్నారు. వైసీపీ దొంగ ఓట్లను నమ్ముకుని ఎన్నికలకు వెళుతోందని ఆరోపించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక తిరుపతిలో జరిగిన కార్పొరేషన్, ఎంపీ ఉప ఎన్నిక, టౌన్ బ్యాంకు ఎన్నికలను అపహాస్యం చేశారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ దొంగ ఓట్లు వేశారని, అయితే విద్యావంతులు తగిన బుద్ధి చెప్పారని గుర్తుచేశారు. ఓటరు కార్డుకు ఆధార్ కార్డుతో అనుసంధానం చేసి.. గందరగోళానికి తెరదించాలని కోరారు. తుది ముసాయిదా జాబితాలో దొంగ ఓట్లకు అవకాశం లేకుండా చూడాల్సిన బాధ్యత డీఆర్వో, ఈఆర్వో, ఏఈఆర్వోలపై ఉందని చెప్పారు. లేకుంటే న్యాయపరంగా పోరాడాల్సి వస్తుందని హెచ్చరించారు. సుగుణమ్మ నివాసం నుంచి ర్యాలీగా వచ్చి మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. దొంగ ఓట్లను తొలగించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డికి వినతిపత్రం అందజేశారు.టీడీపీ నేతలు బీఎల్ సంజయ్, ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్, బుల్లెట్ రమణ, దంపూరి భాస్కర్, చినబాబు, మహేష్ యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, సింగంశెట్టి సుబ్బరామయ్య, సూరా సుధాకర రెడ్డి, జయరామ రెడ్డి, రుద్రకోటి సదాశివం, బ్యాంకు శాంతమ్మ, కంకణాల రజనీకాంత్ నాయుడు, ఆముదాల తులసి, ఇనుగొండ సుబ్రహ్మణ్యం, తిరుమల కేశవులు, మన్నెం శ్రీనివాసులు, ఆనంద్ యాదవ్, హేమంత్ రాయల్, కరాటే చంద్ర, రఘు, ప్రకాష్, ధర్మారెడ్డి, విశ్వనాథం, రాజారాం, కేవీ రమణ, రేవతి, లత, జనసేన నాయకులు సుభాషిణి, రాజేష్ ఆచారి, చందన, దుర్గ, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.



నిరుపయోగమైన ఏటీఎం తరహాలో శుద్ధ జలం సరఫరా చేసే యంత్రం

సుజల సమాధి!

శ్రీకాళహస్తి, జనవరి 9 : ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం గత టీడీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సుజల పథకం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. శ్రీకాళహస్తి పట్టణంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్మార్ట్ శుద్ధ జల యంత్రాలు వ్యర్థంగా మారాయి. శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలో 35వార్డులున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అమృత్ పథకానికి శ్రీకాళహస్తిని ఎంపిక చేశారు. పట్టణవ్యాప్తంగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసి రెండు రూపాయల నగదుతో 20 లీటర్ల శుద్ధ జలం సరఫరాకు శ్రీకారం చుట్టారు. దీంతో పేదలందరికీ ఎంతో ప్రయోజనం చేకూరింది. 2018వ సంవత్సరంలో స్మార్ట్ విధానంతో సుజల పథకం చేపట్టారు. ఇందుకోసం రూ.10లక్షల రూపాయలు వెచ్చించారు.పట్టణంలోని ఐదు వార్డులకు శుద్ధజలం సరఫరా చేసేందుకు భూగర్భ పైప్‌లైన్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఈ పైప్ లైన్ పొడవునా అక్కడక్కడా స్మార్ట్ కుళాయిలను ఏర్పాటు చేశారు. వినియోగదారులు ప్రతి సారీ నగదు చెల్లించాల్సిన అవసరం లేకుండా పురపాలక సంఘంలో డబ్బులు చెల్లించి ఏటీఎం తరహాలో కార్డు పొందవచ్చు.ఆ కార్డు నుంచి ఒక్కో క్యాన్‌కు రెండు రూపాయలు చొప్పున నగదు జమవుతుంది. అలాగే 24గంటల్లో ఎప్పుడైనా శుద్ధ జలం అందుకునే అవకాశం ఉంటుంది. దీనిపై ప్రజల నుంచి మంచి స్పందన కూడా వచ్చింది.ఇంతలో 2019వ సంవత్సరం ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారింది. మిగిలిన వార్డులకు సుజల పథకాన్ని విస్తరించే పని జరగలేదు. ఆరంభంలో అధికారులు ఈ పథకానికి పేరు మార్చి వైయస్సార్ సుజల స్టిక్కర్లను అంటించారు. ఆ తర్వాత క్రమంగా సుజల పథకం జనానికి దూరమైంది. పైప్‌లైన్ విధానం కూడా గాలికి పోయింది. టీడీపీ కార్యాలయం వెనుక వాటర్ ట్యాంక్ వద్ద వందల సంఖ్యలో పేదల నివాస గృహాలున్నాయి.వారంతా అక్కడున్న స్మార్ట్ యంత్రం ద్వారా తాగునీరు తీసుకునేవారు.చాలా కాలం నుంచి అక్కడ శుద్ధజలం కరువైంది. స్మార్ట్ యంత్రం నిరుపయోగం కావడంతో వ్యర్థాలు దాని చుట్టూ వేసేస్తున్నారు.ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి ప్రజాధనం వృధా కాకుండా జనానికి మేలు చేకూర్చే పనులను పునరుద్ధరించాల్సి ఉంది.



గంజాయి నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సెబ్ డీఎస్పీ రమేష్

21కేజీల గంజాయి పట్టివేత

- నలుగురు బెంగళూరు యువకుల అరెస్టు

నాయుడుపేట టౌన్, జనవరి 9 : అక్రమంగా తరలిస్తున్న 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ డీఎస్పీ రమేష్ తెలిపారు. నాయుడుపేట సెబ్ కార్యాలయంలో మంగళవారం పట్టుబడ్డ నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. సెబ్ సీఐ ప్రసాద్ వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నలుగురు యువకులు అనుమానాస్పదంగా కన్పించడంతో వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు.వారి బ్యాగుల్లో 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు బెంగళూరుకు చెందిన కిరణ్, విక్రమ్, గౌడ్‌పాటిల్, శ్యామ్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ 3.15 లక్షలు ఉంటుందని తెలిపారు.

సెలవుపై టీటీడీ ఈవో ధర్మారెడ్డి

జేఈవో వీరబ్రహ్మానికి అదనపు ఈవోగా బాధ్యతలు

తిరుమల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి లాంగ్ లీవ్ తీసుకున్నారు. వ్యక్తిగత పనుల నిమిత్తం అమెరికాకు వెళ్లేందుకు ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయగా సీఎస్ జవహర్ రెడ్డి అంగీకారం తెలిపారు.బుధవారం నుంచి ఈనెల 25వ తేదీవరకు ఆయన సెలవు పొందారు. ఈ క్రమంలో జేఈవో వీరబ్రహ్మానికి అదనపు ఈవోగా తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి

తడ, జనవరి 9: అతి వేగంతో వచ్చిన ఓ లారీ ముందు ఉన్న లారీలను ఢీకొట్టిన ఘటనలో లారీ క్లీనర్ మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రగాయాలపాలయ్యాడు. చెన్నై తండయార్‌పేట ఇండియన్ ఆయిల్ కంపెనీకి చెందిన ట్యాంకర్ లారీ లోడ్‌తో నాగపూర్‌కు సోమవారం అర్ధరాత్రి బయలుదేరింది. సెల్వం లారీని నడుపుతుండగా ఎస్. కృష్ణన్ క్లీనర్‌గా ఉన్నాడు. మార్గ మధ్యలో భీములవారిపాళెం చెక్‌పోస్టుకు సమీపం మత్స్యకార సముదాయ భవనం వద్దకు ఈ లారీ అతివేగంగా వెళ్తూ ముందు వెళ్తున్న టిప్పర్ లారీని వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టిప్పర్ లారీ దాని ముందు వెళ్తున్న ఐసర్‌లారీని ఢీకొనగా, అది వెళ్లి దాని ముందువెళ్తున్న మరో లారీని ఒకదానికొకటి ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో ట్యాంకర్ క్లీనర్ వైపు ముందుభాగం నుజ్జునుజ్జుకాగా క్లీనర్ ఎస్.కృష్ణన్(53) అందులో ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహం సైతం ఛిద్రమైపోయింది. అలాగే ఐసర్ లారీ డ్రైవర్ గౌస్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని మృతదేహంను స్వాధీనం చేసుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో రూ.19లక్షల పట్టివేత



పట్టుబడిన నగదు వివరాలు చెబుతున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

చిల్లకూరు, జనవరి 9:చిల్లకూరు మండలంలోని బూదనం టోల్‌ప్లాజా వద్ద బస్సులో తరలిస్తున్న రూ.19లక్షల నగదును పట్టుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ మంగళవారం వేకువ జామున బూదనం టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. తిరుపతి వెళుతున్న బస్సులో విజయవాడకు చెందిన అరవింద్ కృష్ణ ఎలాంటి పత్రాలు లేకుండా రూ.19లక్షలను తీసుకువెళుతుండగా గుర్తించి నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. సీఐ వేణుగోపాలరెడ్డి, ఎస్ఐ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన అంగన్వాడీలు

- తిరుపతి సహా పలు చోట్ల జైల్ భరో నిర్వహణ
- రిలే దీక్షలు, ధర్నాలు, మానవహారాలు, రాస్తారోకోల హోరు
- పలుచోట్ల మద్దతిచ్చిన కార్మిక సంఘాల నేతల అరెస్టు



నాయుడుపేటలో సీఐటీయూ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

తిరుపతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నిరవధిక సమ్మె చేపట్టిన అంగన్వాడీ ఉద్యోగులు మంగళవారం జిల్లావ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు, ధర్నాలు, ర్యాలీలు, మానవహారాలు, రాస్తారోకోలతో హోరెత్తించారు. తిరుపతి సహా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాలున్న కేంద్రాల్లో జైల్ భరో కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్వాడీ మహిళలకు మద్దతుగా పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులను పలుచోట్ల పోలీసులు అరెస్టు చేశారు. తిరుపతిలో పాత మున్సిపల్ కార్యాలయం వద్ద శిబిరం నుంచీ అంగన్వాడీ మహిళలతో పాటు సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు, మున్సిపల్ వర్కర్లు సైతం జైల్ భరో పేరిట భారీ ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీ నాలుగుకాళ్ళ మండపం చేరగానే పెద్ద సంఖ్యలో మొహరించిన పోలీసులు ముందుకు పోకుండా అడ్డుకున్నారు.ఆగ్రహించిన ఆందోళనకారులు అక్కడే బైఠాయించారు. అనంతరం పోలీసులు వీరిని అదుపులోకి తీసుకుని ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు తరలించగా స్టేషన్ ప్రాంగణంలో బైఠాయించి పెద్దపెట్టున ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జైల్‌భరో నిర్వహించిన ఉద్యోగులకు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ సంఘాల నాయకులు మద్దతు ప్రకటించి కార్యక్రమంలో పాల్గొన్నారు. గూడూరులో గ్రామసేవకుల భవనం వద్ద నుంచీ టవర్ క్లాక్ కూడలి వరకూ అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.ఆ కూడలిలో మానవహారం నిర్మించారు. అనంతరం రాస్తారోకోకు దిగారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి మహిళలకు మద్దతుగా పాల్గొన్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులను అరెస్టు చేశారు. వెంకటగిరిలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం నుంచీ ఉద్యోగులు రాపూరు క్రాస్ రోడ్డు వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడే మానవహారం నిర్మించి తర్వాత రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు ఆందోళనకు నాయకత్వం వహించిన సీఐటీయూ నాయకులను అరెస్టు చేశారు. కోట ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం నుంచీ అంగన్వాడీ మహిళలు బజారు వీధి మీదుగా గాంధీ బొమ్మ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు.అనంతరం అక్కడే మానవహారం ఏర్పరిచారు. ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వున్నారని సమాచారం అందడంతో అక్కడికి వెళుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. నాయుడుపేటలో జైల్ భరో కార్యక్రమం చేపట్టిన అంగన్వాడీ కార్యకర్తలు పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై బైఠాయించడంతో వారికి మద్దతుగా పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. సత్యవేడులో గాంధీ విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టిన అంగన్వాడీలు గంటకు పైగా నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పుత్తూరులో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం నుంచీ అంబేడ్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించిన ఉద్యోగులు అనంతరం ఆ సర్కిల్‌లో ధర్నాకు దిగారు. పిచ్చాటూరులో పోలీస్ స్టేషన్ ఎదుట ఉద్యోగులు జైల్ భరో నిర్వహించారు. చంద్రగిరి, సూళ్ళూరుపేట, శ్రీకాళహస్తి తదితర చోట్ల కూడా అంగన్వాడీ ఉద్యోగులు జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు.



తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో బైఠాయించిన అంగన్వాడీలు



తిరుపతిలో వామపక్షాలతో కలిసి ప్రదర్శన

ఆర్ఏఆర్ఎస్‌కి అవార్డు



సర్టిఫికెట్ అందుకుంటున్న ఏడీఆర్ రమణ, శాస్త్రవేత్తలు

తిరుపతి(విద్య), జనవరి 9: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయవర్సిటీ పరిధిలో తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్ఏఆర్ఎస్) వరుసగా మూడో ఏడాదీ ఉత్తమ పరిశోధనా స్థానం అవార్డును కైవసం చేసుకుంది. గుంటూరులోని వర్సిటీ కేంద్రంగా మంగళవారం నిర్వహించిన 53వ పరిశోధనా, విస్తరణ సలహామండలి సమావేశంలో వీసీ ప్రొఫెసర్ శారదా జయలక్ష్మి, అగ్రిమిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి, రాష్ట్ర మార్కెటింగ్ సలహాదారులు బి.బ్రహ్మానందరెడ్డి చేతులమీదుగా బెస్ట్ రీసెర్చ్ స్టేషన్ సర్టిఫికెట్‌ను ఏడీఆర్ డాక్టర్ సి.రమణ అందుకున్నట్లు ప్రకటించారు. రమణ మాట్లాడుతూ.. మూడో ఏడాదీ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. శాస్త్రవేత్తలు, ఉద్యోగుల సమన్వయంతో సాధించామని తెలిపారు. వర్సిటీ అధికారులు, ఈసీ సభ్యులు, ప్రధానశాస్త్రవేత్తలు డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ పి.బాలహంస్సేన్‌రెడ్డి, డాక్టర్ నాగమాధురి, డాక్టర్ టి.ప్రతిమ, డాక్టర్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూకు నైలెట్ కేంద్రం మంజూరు

రూ.8.5 కోట్ల పరిశోధన ప్రాజెక్టుకు పచ్చ జెండా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 9: ఎస్వీ యూనివర్సిటీకి రూ.8.5 కోట్ల పరిశోధన ప్రాజెక్టు మంజూరైంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నైలెట్) కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రితోపాటు సంబంధిత ఉన్నతాధికారులతో ఎంపీ గురుమూర్తి సంప్రదించి ఈ కేంద్రం మంజూరుకు కృషి చేశారు. యూనివర్సిటీలో నైలెట్ కేంద్రం ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను ఓ కమిటీని అధ్యయనం చేసింది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా కేంద్రం పచ్చజెండా ఊపింది. చెన్నైలోని నైలెట్ ఈ ప్రాజెక్టును నిర్వహించేలా కేంద్రం మార్గదర్శకాలను రూపొందించినట్టు తెలుస్తోంది. ఈ కేంద్రం రాకతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే పలు కోర్సులను నిర్వహించే అవకాశం ఏర్పడుతుంది. పైగా తైవాన్, జపాన్, కొరియా, చైనా వంటి దేశాల్లోని పలు సంస్థలతో ఒప్పందాలను కుదుర్చుకుని కోర్సుల నిర్వహణ, ఉపాధి కల్పన అంశాల్లో పరస్పర సహకారంతో తిరుపతి ప్రాంత విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉంటుంది. కేంద్రం ఏర్పాటైన మూడేళ్ల నుంచి ఏటా వెయ్యి మంది విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకుని, వెలుపలకు రానున్నారు. ఈ కేంద్రం మంజూరుకు సహకరించిన సీఎం జగన్‌కు, కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఎంపీ గురుమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.



పోలీసు స్టేషన్ ముందు నిరసన

ఆగని అంగన్వాడీల ఆందోళన

చంద్రగిరి, జనవరి 9: అంగన్వాడీల సమ్మెలో భాగంగా చంద్రగిరిలో మంగళవారం జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్థానిక టవర్ క్లాక్ వద్ద ధర్నా చేసి, రాస్తారోకో చేశారు. తర్వాత స్టేషన్ వద్ద బైఠాయించారు. పోలీసులు కొంతసేపు వారిని అదుపులోకి తీసుకుని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ మాట్లాడుతూ పోలీసులతో తమ ఉద్యమాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు లక్ష్మి, ప్రియదర్శిని, విజయకుమారి, నాగభూషణమ్మ, లీలా, నాగరాజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

భక్తాంజనేయస్వామి ఆలయంలో యాగ మహోత్సవం


భక్తాంజనేయస్వామి

చంద్రగిరి, జనవరి 9: శ్రీవారిమెట్టు మార్గంలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం శ్రీరామ్ కథా జ్ఞాన యాగ మహోత్సవం ప్రారంభమైంది. తిరుపతికి చెందిన రాజస్థానీ బాలాజీ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ యాగాన్ని 16వ తేదీ వరకు నిర్వహించనున్నారు.ఉదయం శ్రీవారిమెట్టు వద్ద కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి భక్తాంజనేయస్వామి ఆలయం వరకు శ్రీభవ్య శోభ కలశ యాత్రను అంత్యంత వైభవంగా నిర్వహించారు.16వ తేదీ వరకు రోజూ ఉదయం 10.15 గంటలకు మధ్యాహ్నం 2.15 నంచి సాయంత్రం 5.30 గంటల వరకు కథా గాన కార్యక్రమం జరుగుతుంది. ఈనెల 17న పూర్ణాహుతితో యాగం ముగియనుంది.


హోమం నిర్వహిస్తున్న దృశం

కోదండ రామాలయంలో పూజలు

భాకరాపేట, జనవరి 9: పులివర్తి నాని ఆరోగ్యం కోసం టీడీపీ చిన్నగొట్టిగల్లు మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కోదండ రామాలయంలో పూజలు నిర్వహించారు.మదనమోహన, చిట్టెమ్మ, మోహన్‌రెడ్డి, ఆర్వీ రమణారెడ్డి, మునస్వామి నాయుడు, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, కుమారస్వామి రెడ్డి, వెంకటరత్నం, కృష్ణమూర్తి, లోకనాథం, మౌలాలి, మల్లిఖార్జున రెడ్డి, తులసీరాయల్, గురుమూర్తి, రఘునాథ్, జేడీ బాలాజీ, మునిచంద్ర, సురేంద్ర, నాగిరెడ్డి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో గడప గడపకూ మన ప్రభుత్వం

చంద్రగిరి, జనవరి 9: చంద్రగిరి పంచాయతీలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చంద్రగిరి జమండ్లవీధిలో ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, సర్పంచ్ రూపారామ్మూర్తి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తదితరులు ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో బాలాజీనాయక్, సింగిల్ విండో ఛైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి: జనసేన



పాకాల, జనవరి 9: అభివృద్ధి పనులతో పాటు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని జనసేన జిల్లా కార్యదర్శి నజీర్ అన్నారు. దామలచెరువులోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దొంగ ఓట్లు తొలగించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని తిరుపతి ఆర్డీవో కార్యాలయం ఎదుట శాంతియుతంగా దీక్ష చేస్తున్న టీడీపీ చంద్రగిరి నియోజక వర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని పట్ల పోలీసు వ్యవహరించిన తీరు గర్హనీయమన్నారు. ఈ సమావేశంలో జనసేన మండల ఉపాధ్యక్షుడు దినేష్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యాన అధికారి సునీల్

రామచంద్రాపురం, జనవరి 9: రామచంద్రాపురం మండలం నెత్తకుప్పం, అనుపల్లి, సీకేపల్లి గ్రామాల్లో మంగళవారం ఉద్యానశాఖ అధికారి సునీల్ మామిడిలో సస్యరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. మొగ్గ దశలో తేనె మంచు, బూడిద తెగులు, పక్షికన్ను తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పండు ఈగ నివారణకు ఎకరాలకు 8 బుట్టలను వాడాలన్నారు. తామర పురుగులు, మంగు వంటివాటిని నివారించడానికి ఫ్రూట్ కవర్స్‌ను వినియోగించాలని సూచించారు.

పరిశోధనలు మరింత విస్తృతం కావాలి


సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

రామచంద్రాపురం, జనవరి 9: ఔషధరంగంలో జరిగే పరిశోధనలు మరింత విస్తృతం కావాలని ఎస్వీ యూనివర్శిటీ జువాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రాజశేఖర్ అన్నారు. వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మశీ కళాశాలలో ఎమర్జింగ్ ఇన్నోవేటివ్ ట్రెండ్స్, చాలెంజస్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ అనే అంశంపై రెండురోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సదస్సు మంగళవారంతో ముగిసింది.ఈ సదస్సును సెవెన్ హిల్స్ ఫార్మశీ కళాశాల, అసోసియేషన్ ఆఫ్ ఫార్మాసూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహారాష్ట్రకు చెందిన సందీప్ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ అశోక్ తుళ్లారు మాట్లాడుతూ ఏదైనా జబ్బుకు మందు వేసుకుంటే ఆ జబ్బుతో పాటు ఇతర అవయవాలపై ప్రభావం చూపుతుందని కానీ టార్గెటెడ్ డ్రగ్స్ కేవలం జబ్బుపై మాత్రమే పనిచేస్తాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ నిరంజన్ బాబు మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రపంచ ఔషధకేంద్రంగా భారతదేశం మారనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ బి.కుమార్, కళాశాల అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ శరవణకుమార్, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరంకుశ ప్రభుత్వం రాజ్యమేలుతోంది

ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం

తిరుపతి (రవాణా), జనవరి 9: నిరంకుశ ప్రభుత్వం రాజ్యమేలుతోందని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతమాకుల పుణ్యమూర్తి విమర్శించారు. స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని మంగళవారం ఆయన పరామర్శించారు. నగర అధ్యక్షుడు కాయం వెంకటరత్నం, కార్యవర్గ సభ్యులు దండు విజయ్, ముని, మధు తదితరులున్నారు.

తాయిలాలు పంచితే అభివృద్ధి జరిగినట్టా?: టీడీపీ


సమావేశంలో ప్రసంగిస్తున్న టీడీపీ నాయకులు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 9: చంద్రగిరి నియోకవర్గంలో తాయిలాలు పంచితే అభివృద్ధి జరిగినట్లా అని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిని పేరూరు పంచాయతీ టీడీపీ కార్యదర్శి కాయం వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎప్పుడూ లేనివిధంగా నియోజకవర్గంలో దళితుల మధ్య చిచ్చుపెట్టేలా ఎమ్మెల్యే ప్రయత్నించడం బాధాకరమన్నారు. పులివర్తి నాని దొంగ ఓట్లు తొలగించాలని చేస్తున్న దీక్షను భగ్నం చేయడానికి దళితులను ఎమ్మెల్యే పంపించి.. అన్నదమ్ముల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. 4 సంవత్సరాల 9 నెలల పదవీ కాలంలో చెవిరెడ్డికి ఏ రోజు కూడా దళితులు గుర్తుకు రాలేదన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే దళితులను రెచ్చగొట్టేలా ప్రయత్నం చేయడం ఆయన బలహీనతకు నిదర్శనమని చెప్పారు. చంద్రగిరిలో దళితులంతా నానికి మద్దతుగా ఉన్నారని, వైసీపీలోని దళితులు వాస్తవాలు గ్రహించాలన్నారు. టీడీపీ నాయకులు మదన్ రవి, శ్రావణ్, నాగరాజు, హరి, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్తంభిస్తున్న విద్యా వ్యవస్థ

● సమ్మెలో ఎస్ఎస్ఏ సిబ్బంది ● ప్రభుత్వానికి చేరని డేటా వివరాలు ● మధ్యాహ్న భోజన బిల్లులు అందేనా..?

తిరుపతి(విద్య), జనవరి 9: ప్రభుత్వానికి, విద్యావ్యవస్థకు అనుసంధానంగా పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది నిరవధిక సమ్మెతో విద్యావ్యవస్థ పనితీరు అస్తవ్యస్తంగా మారుతోంది. గత నెల 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తున్న క్రమంలో క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన వివరాలు ప్రభుత్వానికి నివేదించడం, ప్రభుత్వం నుంచి ఉపాధ్యాయులకు వచ్చే ఉత్తర్వులను వారికి అందజేయడం తదితర అంశాలు కుంటుపడ్డాయి. దీంతో విద్యాశాఖ కమిషనరేట్ నుంచి వచ్చే ఉత్తర్వులు అమలు చేయడం, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ, నిర్వహణ అంశాలు మండలాల్లో పనిచేస్తున్న ఇద్దరేసి ఎంఈవోలకు తలభారం అవుతోంది. సమయానికి నివేదికలు రూపొందించి, ప్రభుత్వానికి అందించలేక ఎంఈవోలు సతమతమవుతున్నారు. ప్రతి నెలా మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు చెల్లించాల్సిన బిల్లులు కూడా ఎస్ఎస్ఏ సిబ్బందే నిర్వహించాల్సి ఉంది. వీరు సమ్మెలో ఉండటంతో ఈనెల మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు బిల్లులు చెల్లించే అవకాశం లేదని తెలుస్తోంది. కేవలం 20 రోజుల్లోనే విద్యావ్యవస్థ ఇలా మారుతుంటే సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది నిరవధిక సమ్మె చేస్తే మొత్తం విద్యావ్యవస్థ నిద్రాన్న స్థితిలోకి వెళ్లక మారదన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

నిలిచిపోయిన విధులు

విద్యావ్యవస్థలో పదేళ్లుగా సీఆర్‌పీలు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఐఆర్‌టీలు ప్రతి మండలంలో ఎమ్మార్సీలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. ప్రతి ఏటా వీరిని రెన్యువల్ పద్ధతిలో తిరిగి కాంట్రాక్టు సిబ్బందిగా ప్రభుత్వం తీసుకోవడం పరిపాటిగా మారింది. గతంలో సీఆర్‌పీలుగా పరిగణిస్తున్న వారిని ఇప్పుడు సీఆర్ఎంపీ (క్లస్టర్ రీసోర్సు మొబైల్ టీచర్)గా పిలుస్తున్నారు. వీరు ముఖ్యంగా సింగిల్ టీచర్ ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సెలవుపై వెళితే ఆ పాఠశాలకు వెళ్లి తరగతులు నిర్వహించాలి. దీంతో పాటు ఆయా క్లస్టర్ పరిధిలో అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం వివరాలు సేకరించి అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి నివేదికలు పంపాలి. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు వివరాలు నమోదు చేయాలి. దీంతో పాటు నాడు-నేడు పనుల పురోగతి గురించి ఎప్పటికప్పుడు నివేదికలు పంపాలి. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించి అక్కడ తీసుకునే నిర్ణయాలను ఎంఈవోల ద్వారా విద్యాశాఖకు అందజేయాలి. లైబ్రరీలకు వచ్చే పుస్తకాలను ఆయా పాఠశాలలకు పంపిణీ చేయాలి. ఇదిలా ఉండగా విద్యా సంవత్సరం ప్రారంభంలో సీఆర్ఎంపీలదే కీలక పాత్ర అన్నది జగమెరిగిన సత్యం. ఇదిలా ఉండగా సీఆర్ఎంపీలను, ఎంఈవో వ్యవస్థకు అనుసంధానంగా పనిచేస్తున్న ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు కూడా సమ్మెలోకి వెళ్లిపోయారు. దీంతో కంప్యూటర్ పనులన్నీ ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. చైల్డ్ ఇన్ఫో, విద్యార్థుల ఆధార్ సీడింగ్, జగనన్న గోరుముద్ద, ఈ-మెయిల్స్ తదితర పనులు నిలిచిపోయాయి.

డిమాండ్లను పట్టించుకోని సర్కారు

ఐదేళ్లుగా తమ డిమాండ్లను పరిష్కరించాలని సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బంది ప్రభుత్వాన్ని కోరుతూనే ఉన్నారు. వారి డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గత నెల 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లిపోయారు. దీంతో జిల్లాలోని అన్ని మండలాల్లో ఎమ్మార్సీ కార్యాలయాలు మూతపడ్డాయి. కంప్యూటర్లు మూగపోయాయి. సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలని, వారి విధులను క్రమబద్ధీకరించాలని, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చేలా పీఆర్‌సీలో 23 శాతం తమకు ఇవ్వాలని, ప్రతి నెలా వేతనం అందించాలన్నది వీరి ప్రధాన డిమాండ్. ఇకపోతే మహిళా సిబ్బందికి చైల్డ్‌కేర్ సెలవులు మంజూరు చేయాలని, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు జాబ్ చార్ట్ విడుదల చేయాలని, సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బందికి ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై గత నెల ప్రభుత్వానికి సమ్మె నోటీసులు ఇచ్చినా స్పందన లేకపోవడంతో డిసెంబరు 20వ తేదీ నుంచి సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బంది నిరవధిక సమ్మెలోకి దిగారు. ఎమ్మార్సీ కార్యాలయాలకు వెళ్లకుండా జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ వద్ద ధర్నా, నిరసనలు తెలుపుతున్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకుంటే సమ్మెను మరింత ఉధృతం చేసే దిశగా ఎస్ఎస్ఏ సిబ్బంది భవిష్యత్ ప్రణాళిక రూపొందించుకుంటున్నారు. కాగా ఎస్ఎస్ఏ సిబ్బంది సమ్మెలో ఉండటంతో ప్రభుత్వం వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. విధులకు హాజరు కాకుండా ఉన్న మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని ప్రభుత్వం వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది.


ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్న మునికృష్ణనాయుడు తదితరులు

ఎస్ఎస్ ఉద్యోగుల సమ్మెకు ఎస్టీయూ మద్దతు

తిరుపతి(విద్య), జనవరి 9: కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సమగ్రశిక్ష (ఎస్ఎస్) ఉద్యోగులు చేపట్టిన సమ్మె మంగళవారంతో 21వరోజుకు చేరుకుంది. ఈసమ్మెకు ఎస్టీయూ నాయకులు మద్దతు ప్రకటించారు. సంఘ జిల్లా ఆర్థిక కార్యదర్శి భీమినేని మునికృష్ణనాయుడు, సీనియర్ నాయకుడు ధనుంజయులు నాయుడు మాట్లాడుతూ.. సీఎం జగన్ హామీప్రకారం ఎస్ఎస్‌లోని అన్ని విభాగాల ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీని నిర్ణయించాలని, 62 ఏళ్లకాలానికి పదవీవిరమణ చేయాలని, సకాలంలో జీతాలు అందించాలని కోరారు. నాయకులు దొరసామయ్య, మురళీకృష్ణ, హరిప్రసాద్‌రెడ్డి, రఘునాథ్, రమేష్‌నాయక్, మనోహర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయ మాస్టర్ ప్లాన్‌పై కసరత్తు

శ్రీకాళహస్తి జనవరి 9: ముక్కంటి ఆలయ మాస్టర్ ప్లాన్‌పై మంగళవారం అధికారులు కసరత్తు చేశారు. మాస్టర్ ప్లాన్ డిజైన్ రూపొందించిన ద్రోణా సంస్థ ప్రతినిధులు మంగళవారం శ్రీకాళహస్తిలో పర్యటించారు. ఈవో రామారావు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, ద్రోణ ప్రతినిధులతో కలిసి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా జరగబోయే నిర్మాణాలపై చర్చించారు. ఇందులో భాగంగా తేరువీధి, రాజగోపురం, బిక్షాల గాలిగోపురం, శివయ్య గోపురం, జలవినాయక కూడలి, సన్నిధి వీధి, టూరిస్టు బస్టాండు, గుడ్డేరు, భరద్వాజ తీర్థం ప్రాంతాల్లో స్థల పరిశీలన చేశారు. ఆయా చోట్ల మాస్ ప్లాన్ డిజైన్‌లో భాగంగా చేపట్టబోయే నిర్మాణాలపై అధ్యయనం చేశారు. ఈఈ నూక రత్నం, ఏఈ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


బిక్షాల గాలిగోపురం వద్ద పరిశీలిస్తున్న ఈవో రామారావు

వేద భూమి రుణం తీర్చలేం

వేద భూమి భారత గడ్డ రుణం తీర్చలేమని సప్త ఋషి చారిటబుల్ ట్రస్టు సభ్యులు అన్నారు.ఈ ట్రస్టు ఆధ్వర్యంలో దేశంలోని దేవాలయాలను దర్శించే లక్ష్యం తో వేద భారత్ పరిక్రమ యాత్ర చేపట్టారు. మంగళవారం యాత్ర శ్రీకాళహస్తికి చేరుకోగా ఈవో రామారావు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

వైభవంగా ప్రదోష పూజలు


నందీశ్వరుడికి జరుగుతున్న అభిషేకాలు

నాగలాపురం, జనవరి 9: సురుటుపల్లి పల్లికొండేశ్వరాలయంలో మంగళవారం ప్రదోష పూజలు వైభవంగా జరిగాయి.ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్ ప్రదోష మండపంలోని నందీశ్వరుడికి అభిషేకాలు చేసి దీప, ధూప నైవేద్యాలు సమర్పించారు. స్వామి వారిని అలంకరించి నక్షత్ర హారతి, కుంభహారతి, మహా హారతి చేపట్టారు.స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ ఆవరణలో ప్రాకారోత్సవం నిర్వహించారు.

పల్లికొండేశ్వరుడి హుండీ ఆదాయం రూ.5,89,417

పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో గత 66 రోజులకు సంబంధించి హుండీ లెక్కింపు మంగళవారం జరిగింది.ఈవో రామచంద్రారెడ్డి, ఛైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 5,89,417 రూపాయలు ఆలయానికి ఆదాయం వచ్చినట్లు జూనియర్ అసిస్టెంట్ శరవణ తెలిపారు. ఈ ఆదాయం ఆలయానికి వచ్చిన భక్తులు హుండీలో చెల్లించుకున్న కానుకలని తెలిపారు.దేవదాయశాఖ తిరుపతి డివిజన్ ఇన్‌స్పెక్టర్ పనిరాజశయన తదితరులు పాల్గొన్నారు.

నానీ ఆరోగ్యం కోసం పూజలు


పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, జనవరి 9: పెట్రోల్ మీద పడి అస్వస్థతకు గురై తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని త్వరగా కోలుకోవాలని ఆర్‌సీపురం టీడీపీ నాయకులు మంగళవారం భవానీ జలకంఠేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 కొబ్బరికాయలు కొట్టారు. టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు చిన్నబాబు, జనార్ధన చౌదరి, ఉమాపతినాయుడు, హరిప్రసాద్, నరసింహారెడ్డి, మండల నాయకులు ముని నాయుడు, గిరిధర్‌రెడ్డి, మునిబాబురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మాధవయ్య పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో జమ్మూ కాశ్మీర్ చీఫ్ జస్టిస్



శ్రీకాళహస్తి జనవరి 9: శ్రీకాళహస్తీశ్వరాల యాన్ని జమ్మూ కాశ్మీర్ హైకోర్టు చీఫ్ జస్టిస్ తషి రబస్తన్ మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో పండితులు శేష వస్త్రంతో సత్కరించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్థానిక 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసులు నాయక్, శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి, జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య


రాణెమ్మ(పాతచిత్రం)

ఏర్పేడు, జనవరి 9: అప్పుల బాధ తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం ఏర్పేడు మండలంలో చోటు చేసుకుంది.ఎస్ఐ జిలానీ కథనం మేరకు...రావిళ్లవారికండ్రిగ గిరిజన కాలనీకి చెందిన రాణెమ్మ(44) రూ.లక్ష వరకు రైతుల వద్ద ఏడాది క్రితం అప్పు చేసింది.అప్పు తీర్చలేని పరిస్థితుల్లో మూడు నెలలుగా మానసికంగా కుంగిపోయింది. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో ఇనుప కమ్మీకి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.ఇరుగుపొరుగువారు గమనించి ఆమె కుమారుడు సుబ్రహ్మణ్యానికి సమాచారమిచ్చారు. ఆయన ఇంటికి చేరుకుని రాణెమ్మ మృతదేహాన్ని కిందకు దించి పోలీసులకు సమాచారమిచ్చారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీటీడీ చీఫ్ పీఆర్వో బాధ్యతల స్వీకారం


రవి నీలిమ శేఖర్

తిరుమల, జనవరి 9 (ఆంధ్ర జ్యోతి): టీటీడీ చీఫ్ పీఆర్వోగా తలారి రవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పీఆర్వో రవికి టీటీడీ ఇటీవల చీఫ్ పీఆర్వోగా పదోన్నతి కల్పించింది.15 ఏళ్లుగా టీటీడీలో పీఆర్వోగా ఉన్న రవి శ్రీవారిసేవ విభాగంలో కీలక బాధ్యతలు నిర్వహించడంతో పాటు శ్రీవారి వైభవాన్ని వ్యాప్తి చేయడంలో భాగంగా మీడియాను కోఆర్డినేట్ చేస్తూ ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలందుకున్నారు. ఈ క్రమంలో ఆయనకు చీఫ్ పీఆర్వోగా పదోన్నతి కల్పించిన నేపథ్యంలో మంగళవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం టీటీడీ ఛైర్మన్ కరుణాకర రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఏపీఆర్వోగా ఉన్న నీలిమకు పీఆర్వోగా, ఫొటోగ్రాఫర్‌గా ఉన్న శేఖర్‌కు చీఫ్ ఫొటోగ్రాఫర్‌గా పదోన్నతి కల్పించారు.

లక్ష దొంగ ఓట్లు చేర్పించినట్టు నిరూపిస్తే నామినేషన్ కూడా వేయను: మోహిత్‌రెడ్డి

తిరుపతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గంలో లక్ష దొంగ ఓట్లు చేర్పించినట్టు నిరూపిస్తే వచ్చే ఎన్నికల్లో తాను నామినేషన్ కూడా వేయనని చంద్రగిరి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రకటించారు. ఈమేరకు టీడీపీ అధినేత చంద్రబాబుకు లేఖ రాసినట్టు తెలిపారు. విజయవాడలో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులకు చంద్రబాబు చేసిన ఫిర్యాదుపై స్పందిస్తూ, మోహిత్ తిరుచానూరులోని ఓ ప్రైవేటు హోటల్‌లో మంగవారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుకు రాసిన బహిరంగలేఖను విడుదల చేశారు. అందులో ఆయన చంద్రబాబును తాతా అని సంబోధించారు. 2019 ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,91,734 ఉంటే ఇపుడు 3,08,672 ఓట్లు ఉన్నాయన్నారు. ఐదేళ్లలో కేవలం 16వేల ఓట్లు మాత్రమే పెరిగాయన్నారు. కాగా గతేడాది నవంబరులో కేవలం నాలుగు రోజుల్లో టీడీపీకి చెందిన 14,200 దొంగ ఫామ్-7లు నింపి దరఖాస్తు చేశారని ఆరోపించారు. అసత్య ఆరోపణలు చేసిన వారిపై పరువు నష్టం దావా వేస్తున్నానని తెలిపారు. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు సైతం వెనుకాడనని స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో ఆయనతోపాటు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ జయదేవ నాయుడు, నరసింగాపురం సింగిల్‌విండో ఛైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, పేరూరు, చిగురువాడ సర్పంచులు దామినీడు కేశవులు, ప్రదీప్‌రెడ్డి, పేరూరు ఎంపీటీసీ చంద్రమోహన్‌రెడ్డి, ఎర్రావారిపాలెం వైసీపీ ఇన్‌చార్జి చెంగల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఆరు నెలల జైలు

తిరుపతి(లీగల్), జనవరి 9: తిరుచానూరులో దొంగతనానికి పాల్పడిన తమిళనాడు తిరువూరుకు చెందిన చెన్నైకుమార్‌కు ఆరు నెలల జైలుశిక్ష విధించారు. ఈ మేరకు తిరుపతి ఐదో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి వైసరిత తీర్పు చెప్పారు. 2018లో తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో విశ్రాంత పోలీస్ అధికారి భాస్కర్‌నాయుడు ఇంట్లో చెన్నైకుమార్ దొంగతనానికి పాల్పడ్డాడు. నిందితుడిని తిరుచానూరు పోలీసులు అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. నేరం నిరూపణ కావడంతో న్యాయమూర్తి పైవిధంగా శిక్ష విధించారు. సీఐలు శివప్రసాద్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, రాజశేఖర్, ఎస్ఐ రామాంజనేయులు, కోర్టు కానిస్టేబుల్ సుమన్‌లను ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి అభినందించారు.

పులివర్తిని పరామర్శించిన సైకం



తిరుపతి రూరల్, జనవరి 9: స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సైకం జయచంద్రారెడ్డి పరామర్శించారు. మంగళవారం స్విమ్స్‌కు వెళ్లి నాని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలనీ, చివరకు న్యాయమే గెలుస్తుందని భరోసా ఇచ్చారు. ఆయనవెంట పలువురు నాయకులు, కార్యకర్తలున్నారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం


చికిత్స పొందుతున్న మునిశేఖర్

శ్రీకాళహస్తి జనవరి 9: మద్యం మత్తులో పలువురు యువకులు వీరంగం సృష్టించిన ఘటన మంగళవారం శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ వద్ద చోటుచేసుకుంది. ఓ స్నేహితుని కార్యం కోసం పట్టణానికి చెందిన కొందరు యువకులు ఎన్టీఆర్ నగర్ వద్ద కలుసుకున్నారు. మద్యం మత్తులో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుని పలువురు ఘర్షణకు దిగారు.. శ్రీకాళహస్తి పట్టణం మరాఠి పాలునికి చెందిన మునిశేఖర్ పంక్చర్ దుకాణం నిర్వహిస్తుంటాడు. ఇందులో మునిశేఖర్ ముఖంపై మద్యం సీసాతో దాడి జరిగిందని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చేరాడు. భారీగా యువకులు ఆసుపత్రి వద్ద గుమిగూడారు. ఉద్రిక్త పరిస్థితులు ఎదురవకుండా పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని అదుపు చేశారు.

అగంతకుడి భయంలో గిరిజనులు


పట్టుబడ్డ అగంతకుడు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 9: బుచ్చినాయుడుకండ్రిగ ఈబీసీ కాలనీలోని గిరిజనులను అగంతకులు భయభ్రాంతు లకు గురిచే శారు. కాలనీవాసుల సమా చారం మేరకు.... సోమవారం రాత్రి 11గంట ల సమయంలో ఓ అగంతకుడు గిరిజనుల ఇళ్లకు వచ్చి తలుపు తట్టి భోజనం కావాలని అడిగాడు. ఆ ఇంట్లోని వ్యక్తి తలుపు తెరిచి ఈ సమయంలో భోజనం లేదని మందలించి పంపాడు. అతడు మరో ఇంటికి వెళ్లి తలుపులు గట్టిగా తట్టడంతో ఇంట్లోని మహిళలు భయభ్రాంతులకు గురై కేకలు వేయగా సమీపంలోని ఇండ్లవారంతా రావడంతో అగంతకుడు పారిపోయారు. స్థానికులు వెంబడించి పట్టుకుని ఆరా తీయగా తమిళనాడు అని ఒకసారి, సూళ్లూరుపేట అని మరోసారి పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ కాలనీలో తరచూ అగంతకులు తారసపడుతుండడంతో రాత్రి పూట పరిశ్రమలకు వెళ్లే వారు మహిళలను, పిల్లలను ఇంటి వద్ద వదలి వెళ్లడానికి ఆందోళన చెందుతున్నామని చెప్పారు.పోలీసులు స్పందించి కాలనీవాసులకు రక్షణ కల్పించాలన్నారు.

రేణిగుంటలో విద్యుత్ అదాలత్



రేణిగుంట, జనవరి 9 :విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అదాలత్ లాంటి అవకాశాలను ఉపయోగించుకోవచ్చునని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఛైర్‌పర్సన్ వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి వెల్లడించారు.రేణిగుంట ఎఫ్‌సీఐ గిడ్డంగుల వద్ద వున్న రూరల్ విద్యుత్ సెక్షన్ కార్యాలయం వద్ద మంగళవారం విద్యుత్ అదాలత్ నిర్వహించారు.పలువురు వినియోగదారులు తమ సమస్యలను వివరించారు. విద్యుత్ సంస్థ నిబంధనల మేరకు రికార్డులు పొందుపరచి సమస్యలు పరిష్కరించుకోవచ్చునని సూచించారు.భూవివాదాలు ఈ అదాలత్‌లో పరిష్కరించలేమన్నారు.పేర్లు మార్చుకోవలసిన వారు ముందు ఆస్తి రికార్డులు మార్చుకొని, అనంతరం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదాలత్ సభ్యులు కె.రామమోహన రావు,ఎస్ఎల్ అంజనీ కుమార్,జి. ఈశ్వరమ్మ, ఈఈ కె.వాసుదేవరెడ్డితో పాటు ఎస్ఏవో శ్రీనివాసులు,డీఈఈ ప్రభాకర్,ఏఏవో టి.జయరాం,ఏఈలు టి.మోహన్, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని అభివృద్ధి చేస్తే దొంగ ఓట్ల అవసరం ఏముంది..?
టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ



సమావేశంలో ప్రసంగిస్తున్న ఆర్సీ మునికృష్ణ

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 9: తిరుపతి నగరాన్ని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ అభియన్‌రెడ్డి అభివృద్ధి చేసి ఉంటే కార్పొరేటర్ల చేత దొంగ ఓట్లు ఎక్కించాల్సిన అవసరం ఏముందని టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ ప్రశ్నించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. టౌన్‌బ్యాంకు ఎన్నికలు ఏ విధంగా జరిగాయో ప్రజలందరికీ తెలుసన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగ ఓట్లు వేసిన ఇద్దరు కార్పొరేటర్లపై కేసు నమోదు చేయడం నగరపాలక మండలికి సిగ్గుచేటన్నారు. నగరంలో ప్రజలు వైసీపీకి ఓటు వేయరని.. దొంగ ఓట్లు ఎక్కించుకుని గెలవాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, లేకుంటే దొంగ ఓట్లు వేసే అవకాశం ఉందని విజ్ఞప్తి చేశారు. టీడీపీ నాయకులు బ్యాంకు శాంతమ్మ, రాజారాం, విశ్వనాథం, సుకుమార్, నాగ ప్రతాప్, సుధాకర్‌రెడ్డి, ముని సుబ్రహ్మణ్యం, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒకే పార్టీ నేతలు.. భిన్న స్వరాలు
తిరుపతి భూకబ్జాలపై వైసీపీ మహిళా నేత మండిపాటు

తిరుపతి, జనవరి9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఓ భూవివాద ఘటన అధికార పార్టీలో కలవరం పుట్టించింది. వైసీపీకి చెందిన ఇరువురు నేతలు చెరోవైపు మద్దతుగా నిలవడం రాజకీయ చర్చకు దారితీసింది. వివరాలను పరిశీలిస్తే.. అక్కారంపల్లె లెక్క దాఖల్లోని ఉపాధ్యాయ నగర్‌లో సర్వే నెంబరు 11/2బీ2లోని 25 సెంట్ల స్థలం తమదంటే తమదని ఇరువర్గాలు రంగంలోకి దిగాయి. ప్రహరీ కట్టి తమ సంరక్షణలో ఉన్న స్థలంలో ఓ జర్నలిస్టు ద్వారా లక్ష్మమ్మ, పూర్ణమ్మలు వచ్చి దందా చేస్తున్నారని జ్యోతి అనే మహిళ ఆరోపించారు. అయితే 42ఏళ్ల క్రితమే కొనుగోలు చేసిన స్థలాన్ని వైసీపీ నేతలు, పోలీసులు కలిసి తమకు అన్యాయం చేస్తున్నారని రుద్రరాజు పూర్ణమ్మ, దొమ్మరాజు లక్ష్మమ్మ ఆవేదన చెందారు. కొన్నిరోజులుగా జరుగుతున్న ఈ వివాదంలో జ్యోతికి మద్దతుగా వైసీపీ కార్పొరేటర్ లడ్డు భాస్కర్ రెడ్డి వెళ్లగా.. పూర్ణమ్మ, లక్ష్మమ్మలకు మద్దతుగా అదే పార్టీకి చెందిన మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యురాలు రుద్రరాజు శ్రీదేవి నిలిచారు. సదరు స్థలంలో రాత్రికిరాత్రే జ్యోతి వర్గీయులు నిర్మించిన రేకుల షెడ్డులో ఉన్న లక్ష్మమ్మ, పూర్ణమ్మలను భాస్కర్‌రెడ్డి బలవంతంగా ఖాళీ చేయించిన వీడియో, ఫొటోలతో మీడియాకు వెల్లడించారు. తిరుపతి నగరంలో ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా చేస్తున్నారని, ఎక్కడ చూసినా అక్రమాలు, కబ్జాలు తప్ప వేరేది కనపడటం లేదని, దీనివల్ల సామాన్యులు భయభ్రాంతులకు గురవుతున్నారని మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో శ్రీదేవి చేసిన వ్యాఖ్యలు దుమారం లేపాయి. తమ క్షత్రియవర్గానికి చెందిన భూమిని కాపాడలేకపోతే తాను పదవిలో ఉండి ప్రయోజనమేమిటని ప్రశ్నించిన తీరు అధికారపక్షాన్ని ఇబ్బంది పెట్టాయి. తిరుపతి.. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టు ఉందని, కబ్జాదారులకు మద్దతు తెలుపుతున్న అలిపిరి సీఐ అబ్బన్నను సస్పెండ్ చేయాలని డిమాండు చేయడం చర్చగా మారింది. ఎన్నికల సమీపిస్తున్న వేళ వీరి తీరుపై స్థానిక నాయకత్వం ఏవిధంగా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. కాగా.. నకిలీ మనుషులతో దళితుల భూమిని కబ్జా చేసేందుకు ఒక జర్నలిస్టు ప్రయత్నిస్తున్నాడని ప్రెస్‌క్లబ్‌లో జ్యోతి విమర్శించారు.

సమయపాలన, పారదర్శకతకు పెద్దపీట
ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 9: సమయపాలన, పారదర్శకతకు పెద్దపీట వేస్తామని ఎస్వీయూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వి.శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. పలు సెక్షన్ల ఉన్నతాధికారులతో తన చాంబర్‌లో మంగళవారం సమీక్షించారు. సమయ పాలన, పారదర్శకత, 24 గంటల్లో ఫైళ్ల క్లియరెన్స్, సంపూర్ణ ఈ-ఫైలింగ్‌పై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. వర్సిటీపై వస్తున్న విమర్శలన్నింటినీ తిప్పికొట్టేలా ప్రతి ఉద్యోగి నిబద్ధత, అంకితభావంతో పని చేయాలని కోరారు. ఉద్యోగుల పనితీరుపై ఆయా సెక్షన్ అధికారులు నివేదిక సమర్పించాలని సూచించారు. ఈ-ఫైలింగ్ విధానాన్ని అన్ని విభాగాలకు విస్తరించాలని చెప్పారు. ప్రతి ఫైల్‌ను 24 గంటల్లో క్లియర్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో వేగవంతంగా నడిపించడానికి పటిష్ఠ చర్యలు తీసుకోక తప్పదని అభిప్రాయపడ్డారు. దీనికి డిప్యూటీ రిజిస్ట్రార్లు, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు దోహదం చేయాలని కోరారు. రిజిస్ట్రార్ హుస్సేన్, పరీక్షల విభాగం అధికారి దామ్లానాయక్, డీఆర్‌లు, ఏఏవోలు పుష్పలత, లోకనాథం, చంద్రశేఖర్‌నాయక్, లక్ష్మీనారాయణ, సురేష్‌బాబు, శ్రీనివాసరాజు, చంద్రశేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ గోశాలలో 16న కనుమ పండగ

తిరుపతి (కల్చరల్), జనవరి 9: తిరుపతిలోని టీటీడీ గోశాలలో ఈనెల 16వ తేదీన కనుమ పండగ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వేణుగోపాలస్వామి వారి సన్నిధిలో గోపూజ, తులసిపూజ, గొబ్బెమ్మ వేడుక తదితరాలు జరుగుతాయని టీటీడీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. అనంతరం హిందూ ధర్మప్రచారపరిషత్ ఆధ్వర్యంలో సంక్రాంతి హరిదాసులు, బసవన్నల నృత్యం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. మధ్యాహ్నం నుంచి వేణుగోపాలస్వామి దర్శనం, ప్రసాద వితరణ ఉంటుంది.

కొనసాగిన న్యాయవాదుల దీక్ష

తిరుపతి(లీగల్), జనవరి 9: ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్ట్‌కు నిరసనగా తిరుపతి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేపట్టిన రిలే దీక్ష రెండో రోజుకు చేరుకుంది. మంగళవారం జరిగిన దీక్షలో సీనియర్ న్యాయవాది జి.తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు హిమబిందు, మురళీధర్‌రెడ్డి, మౌనిక, మోహన్‌ల తోపాటు వారి కక్షిదారులు పాల్గొన్నారు.

నేడు వాకర్స్ సంఘాల సమావేశం

తిరుపతి(ఆటోనగర్), జనవరి 9: వీవీ మహల్ రోడ్డులోని రోటరీ క్లబ్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఐదు గంటలకు నగర పరిధిలో ఉన్న వాకర్స్ సంఘాల సమావేశం జరగనుంది. ఈ మేరకు వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ తెలిపారు. అన్ని సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొనాలని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

హెల్త్ విలేజ్ థీమ్‌పై 18నుంచి జాతీయ వర్క్‌షాప్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న సూర్యకుమారి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 9: హెల్త్ విలేజ్ థీమ్‌పై ఈనెల 18 నుంచి మూడ్రోజులపాటు తిరుపతిలో జాతీయ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన వేదిక పద్మావతి యూనివర్సిటీ ఆడిటోరియాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సూర్యకుమారి మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. గ్రామాలను ఆరోగ్యకరంగా ఉంచాలనే లక్ష్యంతో హెల్త్ విలేజ్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, అధికారులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం, ఎల్ఈడీ, లైవ్ స్ట్రీమింగ్, సీటింగ్, స్టాల్స్ గ్రూప్ డిస్కషన్స్, వసతి, శ్రీవారి దర్శనం, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, క్షేత్ర పర్యటనలకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. అవసరమైన కమిటీలను ఏర్పాటు చేసినట్టు జేసీ శుభం బన్సల్ తెలిపారు. స్పెషల్ కమిషనర్ స్వామితా సిరి, వాటర్‌షెడ్స్ డైరెక్టర్ వెంకటరెడ్డి, డీఆర్వో పెంచల్ కిషోర్, డిప్యూటీ కమిషనర్ ఆనంద్, స్మార్ట్‌సిటీ జీఎం చంద్రమౌళి, పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ జనార్దన్ రెడ్డి, జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డీపీవో రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధికారులు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు: డీఈవో

తిరుపతి(విద్య), జనవరి 9: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఈనెల9 నుంచి 18వతేదీవరకు సెలవులు ప్రకటించామని డీఈవో శేఖర్ తెలిపారు. ఈసెలవుల్లో ఎటువంటి తరగతులు నిర్వహించరాదని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యాక్టర్‌గా శిక్షణ పొందుతున్న చరిత్
సినీ హీరో సుధీర్‌బాబు


కుటుంబ సభ్యులతో సుధీర్‌బాబు

తిరుమల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తన పెద్ద కుమారుడు చరిత్ మానస్ యాక్టర్‌గా శిక్షణ పొందుతున్నాడని సినీ హీరో సుధీర్ బాబు తెలిపారు. మంగళవారం ఉదయం కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఎక్కడికి వెళ్లినా తన కుమారుడు చరిత్‌ను ఎప్పుడు సినిమాల్లోకి తీసుకొస్తారని అడుగుతున్నారన్నారు. తను రావడానికి ఇంకా రెండుమూడేళ్లు పడుతుందన్నారు. అలాగే సూపర్ స్టార్ కృష్ణకు ఎంతో ఇష్టమైన తన రెండో అబ్బాయి కూడా ఉన్నాడని, తమ ఫ్యామిలీ నుంచి ఫ్యూచర్ జనరేషన్ సెక్యూర్‌గా ఉందని నవ్వుతూ చెప్పారు. ఏడాదిలో రెండుసార్లు తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ అన్నారు. తెలుగు సినీ పరిశ్రమ, ప్రజలు బాగుండాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు.'మా నాన్న సూపర్ హీరో', 'హరోంహర' చిత్రాల షూటింగ్ చివరి దశకు చేరుకుందని, త్వరలోనే విడుదల తేదీలను ప్రకటిస్తామన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు


పర్బత్‌భాయ్ పటేల్ - సూర్యదేవర నాగవంశీ

తిరుమల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. పార్లమెంటరీ వాటర్ రిసోర్స్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ పర్బత్‌భాయ్ పటేల్, ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, సినీనిర్మాత సూర్యదేవర నాగవంశీ, వైసీపీ నేత దేవినేని అవినాష్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

అంబేడ్కర్ వర్సిటీ డిగ్రీ, పీజీ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 9: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ, డిప్లొమో కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని రీజనల్ ఆఫీసర్ మల్లికార్జునరావు సూచించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.89 కోట్లు

తిరుమల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.89 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 61,511 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 20,777 మంది తలనీలాలు సమర్పించారు.

పాత పింఛను అమలు చేసే పార్టీకే మద్దతు
మజ్దూర్ యూనియన్ నాయకులు



రిలే దీక్షలు చేస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

తిరుపతి(ఆటోనగర్), జనవరి 9: పాత పింఛను విధానం అమలు చేసేలా రాజకీయ పార్టీకే తమ మద్దతు ఉంటుందని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్ డివిజన్ అధ్యక్షుడు కె.సుదర్శన్ రాజు వెల్లడించారు. తిరుపతి రైల్వేస్టేషన్ ఎదుట మంగళవారం యూనియన్ తిరుపతి శాఖ ఏర్పాటు చేసిన రిలేదీక్షలను ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం నూతన పింఛను విధానం రద్దు చేసి.. పాత పింఛను విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై పోరాడటానికి దేశంలోని అన్ని కార్మిక సంఘాలు ఏకమై జాయింట్ ఫోరం ఫర్ రెస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీం (జేఎఫ్ఆర్ఓపీఎస్)గా ఏర్పడ్డాయని చెప్పారు. ఈ సంఘానికి తమ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్ర కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. ఆయన పిలుపుతో భారత రైల్వేలో మంగళవారం నుంచి గురువారం వరకు రిలేదీక్షలు, నిరసనలు చేపట్టామన్నారు. నాయకులు డి.నారాయణస్వామి. మునిరత్నం, రవీంద్రనాయక్, గౌస్‌బాషా, మారయ్య, దేవేంద్రనాథ్, శివకుమార్, జగదీష్, రోహిణి, వెంకటేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నానీకి పరామర్శ



ఎర్రావారిపాళెం, జనవరి 9: స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న నానీని ఎర్రావారిపాళెం మండల తెలుగు తమ్ముళ్లు పరామర్శించారు.టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నా సముద్రం మధుసూదన్, విశ్వనాథరెడ్డి, సుధాకర్ నాయక్, పార్టీ అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ, ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు, హరిశ్చంద్ర, మురళి, అశోక్‌రెడ్డి, శివరామి రెడ్డి, అమరనాథరెడ్డి, చంద్రబాబు, విజయారెడ్డి, సురేంద్రబాబు, నిరంజన్‌రాయల్, వేణుగోపాల్ నాయుడు, రాజన్న, తదితరులు నానీని పరామర్శించారు.

సీఏ ఇంటర్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విద్యార్థుల ప్రతిభ


హరినాథరెడ్డి

తిరుపతి(విద్య), జనవరి 9: ఎల్ఐసీ రోడ్డులోని ఎమరాల్డ్స్ ప్రొఫెషనల్ అకాడమీ విద్యార్థులు సీఏ ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి.. ప్రతిభచాటారని అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.మునిరత్నం తెలిపారు. ఎ.హరినాథ రెడ్డి 441మార్కులతో టాపర్‌గా నిలవగా.. డి.దామోదర్, పి.హువేజ్‌ఖాన్, కె.పుష్పేంద్రరెడ్డి, సి.మాధురి ఉత్తమమార్కులు పొందారన్నారు. మొత్తంమీద 51.47శాతంమంది విద్యార్థులు పాసయ్యారని చెప్పారు. అలాగే జె.రేవతి, కె.యశ్వంత్, టి.రాజశేఖర్, జె.మునిమోహిత్, డి.అమత్యా, ఎస్‌వీ శ్రావణిలు సీఏ ఇంటర్‌ను పూర్తిచేశారన్నారు. విద్యార్థులను డైరెక్టర్లు ఇ.గిరిధర్‌రెడ్డి, కె.విశ్వనాథ్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

'దొంగ ఓట్ల'పై పోరాడండి : జనసేనాని


పవన్‌కల్యాణ్‌కు శ్రీవారి ప్రసాదాలు అందజేస్తున్న రాజారెడ్డి

తిరుపతి(కొర్లగుంట), జనవరి 9: తిరుపతి నియోజకవర్గంలో దొంగ ఓట్ల నమోదుపై పోరాడాలని జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డికి అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం మంగళగిరి కార్యాలయంలో అధినేత మర్యాదపూర్వకంగా కలిసి శ్రీవారి లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

కార్మిక సంఘాల జైల్‌భరో విజయవంతం

తిరుపతి (రవాణా), జనవరి 9: కార్మిక సంఘాల జైల్ భరో కార్యక్రమం మంగళవారం విజయవంతమైంది. రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపుతో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నగరంలో మంగళవారం జైల్‌భరో కార్యక్రమం జరిగింది. అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ డిమాండ్ చేశారు. పాత మున్సిపల్ కార్యాలయం నుంచి నాలుగుకాళ్ల మండపం వద్దకు ర్యాలీ నిర్వహించారు. ఈ సమయంలో పోలీసులు ఆప్రాంతంలో పెద్దఎత్తున మొహరించారు. ప్రదర్శన నిలిపివేయాలని.. ముందుకు వెళ్లడానికి వీల్లేదని ఆంక్షలు పెట్టారు. దాంతో అంగన్వాడీలు, కార్మిక సంఘాల నేతలు అక్కడే బైఠాయించారు. చివరకు వీరిని ఈస్ట్ డీఎస్పీ అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించి.. పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నేతలు కందారపు మురళి, కె.రాధాకృష్ణ, హరికృష్ణ మాట్లాడుతూ.. అంగన్వాడీ మహిళలను ఏడిపిస్తున్న సీఎం జగన్‌కు భవిష్యత్తులో ఏడుపే మిగులుతుందన్నారు. సమస్యను జఠిలం చేసేలా బెదిరింపులకు దిగడం మంచి పద్ధతి కాదన్నారు. తక్షణం కార్మిక సమస్యలు పరిష్కరించకపోతే సీఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నేతలు వేణుగోపాల్, సుబ్రహ్మణ్యం, చిన్న, బుజ్జి, బాలాజీ, శ్రీనివాసులు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు నాగరాజమ్మ, జయప్రభ, ఎల్లమ్మ, గీత, గోమతి, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, సుజిత, సుశీలమ్మ, ఏఐటీయూసీ నేతలు రాధాకృష్ణ, ఎన్‌డి రవి, రాజా, విశ్వనాథ్, ఐఎఫ్‌టీయూ నాయకులు సుబ్రహ్మణ్యం, భారతి, గంగ, అరుణ, శశికళ పాల్గొన్నారు.

బస్టాండులో 'వీల్‌చైర్' సేవకులు


దివ్యాంగుడికి సాయం చేస్తున్న దంపతులు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 9: ఆర్టీసీ బస్టాండులో పరాసర, ఆదిలక్ష్మి దంపతులు దివ్యాంగులు, వృద్ధులకు వీల్‌చైర్ సాయంతో సేవలందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. గతంలో బస్టాండు వెనుక అవుట్ గేట్ నుంచి బెంగళూరు ప్లాట్‌ఫామ్‌కి వెళ్లే క్రమంలో ఓ దివ్యాంగుడు పడుతున్న ఇబ్బందిని శ్రీసాయిలక్ష్మి మెడికల్ దుకాణ నిర్వాహకులైన ఈ దంపతులు చూసి, మనస్సు చలించింది. ఇలాంటివారికి వీల్‌చైర్‌తో సాయం అందించాలనుకున్నారు. ఇందుకోసం రెడ్‌క్రాస్, తిరుపతి మెడికల్ అసోసియేషన్‌ను సంప్రదించి మూడు వీల్‌చైర్లను సమకూర్చుకున్నారు. దుకాణం ముందు వీటిని ఉంచి, అవసరమైన వారికి సాయం చేస్తున్నారు. రోజూ ఉదయం ఎనిమిది నుంచి రాత్రి 11గంటల వరకు వీరి సేవలు అందుబాటులో ఉంటాయి. వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్య బాధితులు వీల్‌చైర్ సాయం పొందవచ్చని బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు సూచించారు.

టీటీడీ ఎస్‌డబ్ల్యూఎఫ్ డైరీ ఆవిష్కరణ



తిరుమల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): టీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ 2024 డైరీని టీటీడీ ఈవో ధర్మారెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, గుణశేఖర్, పద్మనాభం, నాగార్జున, వెంకటరమణారెడ్డి, శ్రీలక్ష్మి, ఇందిరా, భాస్కర్‌రావు, నరేష్ రవికుమార్, శివయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వికసిత భారత్


అధికారి, సిబ్బందిని సన్మానిస్తున్న నాయకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జనవరి 9: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వికసిత భారత్ కార్యక్రమం తిరుపతిలో మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ రవి, వాహన సిబ్బంది రెడ్డెప్ప రంజిత్ కుమార్, రాజేంద్ర, రంజిత్, సుధాకర్‌మోహన్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సాంస్కృతిక విభాగం జిల్లా కన్వీనర్ గుండాల గోపీనాథ్, మునిసుబ్రహ్మణ్యం, సామంచి శ్రీనివాస్, అజయ్‌కుమార్, సుబ్రహ్మణ్యంరెడ్డి, ప్రభాకర్‌నాయుడు, వరప్రసాద్, శ్రీహరిరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీలో శ్రీచైతన్య విద్యార్థి ప్రతిభ


కప్‌తో మహ్మద్ యూసఫ్

తిరుపతి(విద్య), జనవరి 9: తిరుపతిలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల (ఆర్‌బీసీ క్యాంపస్) విద్యార్థి ఎస్.మహ్మద్ యూసఫ్ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ బౌలింగ్ విభాగంలో ప్రతిభ చూపాడని ప్రిన్సిపాల్ ఎస్.సురేష్ తెలిపారు. కడప జిల్లాకు చెందిన జట్టులో యూసఫ్ 11వికెట్లను పడగొట్టి.. జట్టు విజేతగా నిలవడంలో కీలకంగా వ్యవహరించారని తెలిపారు. దాంతో విద్యార్థిని మంగళవారం ఏజీఎం బీవీప్రసాద్, డీన్లు రామోహన్‌రావు, కేఎల్‌జీ ప్రసాద్, జగన్, అధ్యాపకులతో కలిసి అభినందించారు.

పంటలపై ఆగని గజదాడులు


ధ్వంసమైన అరటిచెట్లు

కల్లూరు, జనవరి 9: పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. రెడ్డివారిపల్లి, కమ్మపల్లి పంచాయతీల్లో సోమవారం రాత్రి కొబ్బరి, అరటి, మామిడి, మిరప తదితర పంటలను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. నిన్నటి వరకు వ్యవసాయ పొలాల్లో సంచరిస్తూ పంటలను తొక్కేసిన ఏనుగులు సోమవారం రాత్రి రెడ్డివారిపల్లి పంచాయతీ వంకమద్దివారి పల్లిలో హల్‌చల్ చేశాయి. గ్రామం సరిహద్దులోకి చేరుకున్న ఏనుగులు గ్రామం చుట్టూ ఉన్న అరటిచెట్లను విరిచేశాయి. శిద్దారెడ్డికి చెందిన 30.. శ్రీనివాసులురెడ్డికి చెందిన 5 కొబ్బరిచెట్లను విరిచేశాయి. కమ్మపల్లికి చెందిన దామోదర్‌నాయుడు, రెడ్డిశేఖర్‌నాయుడు అరటి, మిరప పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. ఇటీవల ఏనుగుల దాడులతో పంటలను కోల్పోయిన బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు రామనాథంనాయుడు డిమాండ్ చేశారు.

వరదరాజస్వామి ఆలయ పునఃనిర్మాణ పనుల్లో అపచారం

శ్రీకాళహస్తి జనవరి 9: ప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునఃనిర్మాణ పనుల్లో అపచారం జరుగుతున్నట్లు హిందూ ధార్మిక మండలి సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ముక్కంటి ఆలయ ఈవో రామారావును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రసన్న వరదరాజస్వామి ఆలయ శిథిలాలను పూర్తిగా తొలగించ లేదన్నారు. పాత వ్యర్థాలను పునాదుల్లో నింపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగమ నియమాలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.మండలి జిల్లా కన్వీనర్ సప్పిడి సుబ్బరామిరెడ్డి , శ్రీకాళహస్తి పట్టణ కన్వీనర్ గరికపాటి రమేష్ బాబు, సభ్యులు. బాలిశెట్టి చంద్రశేఖర్, వాసు యాదవ్, మోహన్ రావు, గిరి,ఢిల్లీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి ముద్దు.. జ్ఞానేంద్ర వద్దు
పెనుమూరులో డిప్యూటీ సీఎం అనుకూలవర్గం కొత్త నినాదం


నారాయణస్వామికి మద్దతుగా ప్లకార్డులు చూపుతున్న వైసీపీ నేతలు

పెనుమూరు, జనవరి 9: 'జ్ఞానేంద్రరెడ్డి వద్దు..నారాయణస్వామి ముద్దు' అంటూ పెనుమూరు మండలం పులిగుండు ఏపీ టూరిజం ప్రాంగణంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి అనుకూల వర్గం మంగళవారం డిమాం డ్ చేసింది. పెనుమూరు మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో జరిగిన ఈ సమావేశంలో జ్ఞానేంద్రరెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. మండలంలో జ్ఞానేంద్రరెడ్డి కుటుంబ సభ్యులు 300 ఎకరాలు భూకబ్జా చేశారని వాటికి అడ్డుపడినందుకే నారాయణ స్వామిపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్లకార్డులు పట్టుకుని జ్ఞానేంద్రరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కమలాకరరెడ్డి, ఆరు మండలాల వైసీపీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు పద్మనాభరెడ్డి, బండి హేమసుందర్‌రెడ్డి, తులసియాదవ్, తలాబాలజీ, దనంజయవర్మ, సుకుమార్, జయచంద్రారెడ్డి, నవీన్‌రెడ్డి, గుణశేఖర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, మునిరాజారెడ్డి, మణి, కుప్పయ్య, గురవారెడ్డి, బాబు, శేఖర్‌యాదవ్, అన్ను, యతీశ్వర్‌నాయుడు, లక్ష్మీపతి పాల్గొన్నారు. ఈ సమావేశంతో నియోజకవర్గంలో వైసీపీలో వర్గ విభేదాలు మరింత ముదురుతున్నట్టు అర్థం అవుతోంది.

ముందస్తు సంక్రాంతి సంబరాలు


సుధహో స్కూల్‌లో..


భాష్యం స్కూల్‌లో..


పద్మావతి జూనియర్ కాలేజీలో..

తిరుపతి(విద్య), జనవరి 9: నగరంలోని ప్రైవేట్ విద్యాలయాల్లో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ● న్యూబాలాజీకాలనీలోని భాష్యంస్కూల్‌లో గ్రామీణ వాతావరణం వెల్లివిరిసేలా రంగవల్లులతో అందంగా ముస్తాబు చేశారు. ముగ్గుల పోటీల విజేతలకు జోనల్ ఇన్‌చార్జి లక్ష్మణ్ బహుమతులను అందించారు. జోనల్ ప్రిన్సిపాల్స్, లిటిల్ చాంప్స్ ఇన్‌చార్జిలు, టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ● ఆర్‌సీరోడ్డులోని సుధహ లిటిల్ సిటిజన్స్ హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి టీచర్లు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. డైరెక్టర్ జోగిరెడ్డి రాజేంద్రప్రసాద్‌రెడ్డి, కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, హెచ్‌ఎం నందన పాల్గొన్నారు.

పద్మావతి జూనియర్ కాలేజీలోనూ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): పద్మావతి జూనియర్ కాలేజీలోనూ సంబరాలు జరిగాయి. టీటీడీ విద్యాశాఖాధికారి భాస్కరరెడ్డి, ప్రిన్సిపాల్ భువనేశ్వరి, టీటీడీ విద్యా సలహాదారు డాక్టర్ ఎల్ఆర్ మోహన్ కుమార్ రెడ్డి, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి, అధ్యాపకులు మీనాకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ముక్కంటి ఆలయ మాస్టర్ ప్లాన్‌పై కసరత్తు

శ్రీకాళహస్తి జనవరి 9: ముక్కంటి ఆలయ మాస్టర్ ప్లాన్‌పై మంగళవారం అధికారులు కసరత్తు చేశారు. మాస్టర్ ప్లాన్ డిజైన్ రూపొందించిన ద్రోణా సంస్థ ప్రతినిధులు మంగళవారం శ్రీకాళహస్తిలో పర్యటించారు. ఈవో రామారావు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, ద్రోణ ప్రతినిధులతో కలిసి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా జరగబోయే నిర్మాణాలపై చర్చించారు. ఇందులో భాగంగా తేరువీధి, రాజగోపురం, బిక్షాల గాలిగోపురం, శివయ్య గోపురం, జలవినాయక కూడలి, సన్నిధి వీధి, టూరిస్టు బస్టాండు, గుడ్డేరు, భరద్వాజ తీర్థం ప్రాంతాల్లో స్థల పరిశీలన చేశారు. ఆయా చోట్ల మాస్ ప్లాన్ డిజైన్‌లో భాగంగా చేపట్టబోయే నిర్మాణాలపై అధ్యయనం చేశారు. ఈఈ నూక రత్నం, ఏఈ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వేద భూమి రుణం తీర్చలేం

వేద భూమి భారత గడ్డ రుణం తీర్చలేమని సప్త ఋషి చారిటబుల్ ట్రస్టు సభ్యులు అన్నారు.ఈ ట్రస్టు ఆధ్వర్యంలో దేశంలోని దేవాలయాలను దర్శించే లక్ష్యంతో వేద భారత్ పరిక్రమ యాత్ర చేపట్టారు. మంగళవారం యాత్ర శ్రీకాళహస్తికి చేరుకోగా ఈవో రామారావు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.



బిక్షాల గాలిగోపురం వద్ద పరిశీలిస్తున్న ఈవో రామారావు

అంగన్వాడీల హక్కుల కోసం జైలుకైనా సిద్ధం





ర్యాలీ చేస్తున్న అంగన్వాడీలు - అంబేద్కర్ కూడలి వద్ద రాస్తారోకో

శ్రీకాళహస్తి జనవరి 9: న్యాయపరమైన తమ హక్కుల సాధన కోసం జైలుకు వెళ్లడానికైనా సిద్ధమని అంగన్వాడీలు స్పష్టం చేశారు. శ్రీకాళహస్తిలో మంగళవారం సమ్మెలో భాగంగా అంగన్వాడీలు జైలు భరో కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ కేంద్రం వద్ద నుంచి కార్మిక సంఘాల జేఏసీ నాయకులతో కలిసి పురవీధుల్లో ర్యాలీ చేశారు.అంబేద్కర్ కూడలి వద్దకు చేరుకుని రాస్తారోకోకు దిగారు.టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని అంగన్వాడీలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. సీఐటీయూ నాయకులు అంగేరి పుల్లయ్య, గురవయ్య,మణి, రేవతి, రాజ, ఏఐటీయూసీ నాయకులు మురళి, మణి,గోపి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు నివాళి

శ్రీకాళహస్తి జనవరి 9:టీడీపీ సీనియర్ కార్యకర్త గోపాల్ నాయుడికి పలువురు నివాళులర్పించారు. శ్రీకాళహస్తి మండలం పోలి గ్రామానికి చెందిన అలం గోపాల్ నాయుడు మంగళవారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు తనయుడు దిలీప్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టీడీపీ సీనియర్ నాయకులు జగన్నాథం నాయుడు, ప్రకాష్ నాయుడు, కామేష్ యాదవ్, ప్రసాద్ నాయుడు తదితరులు గోపాల్ నాయుడు మృతదేహానికి పూలమాలలు వేసి సంతాపం వ్యక్తం చేశారు.

జనసేన ప్రచార రథం ప్రారంభం

శ్రీకాళహస్తి జనవరి 9: జనసేన ఎన్నికల ప్రచార రథాన్ని నియోజకవర్గ ఇంచార్జి వినుత ప్రారంభించారు. శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షణ కాళికాదేవి ఆలయంలో మంగళవారం రథానికి పూజలు చేసి ప్రారంభించారు.



వాహనాన్ని ప్రారంభిస్తున్న వినుత

వినుత మాట్లాడుతూ... వచ్చే ఎన్నికల్లో టీడీపీ,జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలుపే ధ్యేయంగా జనసేన కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు.

బకాయిలు చెల్లించకపోతే ఆస్తులు జప్తు

శ్రీకాళహస్తి జనవరి 9: దీర్ఘకాలికంగా పెరిగిపోయిన పన్ను బకాయిలు చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తామని పురపాలక సంఘ కమిషనర్ రమేష్ బాబు హెచ్చరించారు. శ్రీకాళహస్తి పట్టణ పరిధిలో మంగళవారం పన్నుల మొండి బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్న పలువురికి నోటీసులు జారీ చేశారు. గతంలో నోటీసులు జారీ చేసినా స్పందించని వారి స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. అప్పటికీ స్పందించకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లపై నానీ పోరాటం ఆదర్శనీయం

శ్రీకాళహస్తి, జనవరి 9: చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లు తొలగించాలంటూ పులివర్తి నాని చేసిన పోరాటం ఆదర్శనీయమని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న నానీని మంగళవారం సుధీర్ రెడ్డి పరామర్శించారు.శ్రీకాళహస్తి మాజీ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ చెంచయ్య నాయుడు తదితరులు ఆయన వెంట వున్నారు.

వార్డు వలంటీరు స్థానాలకు దరఖాస్తు చేసుకోండి

శ్రీకాళహస్తి జనవరి 9: ఆసక్తి కలిగిన అభ్యర్థులు శ్రీకాళహస్తి వార్డు వలంటీర్ స్థానాలకు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ రమేష్ బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణ పరిధిలో 26 వలంటీర్ స్థానాలు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. అర్హులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు.

ఈవీఎంలపై అవగాహన

వరదయ్యపాళెం, జనవరి 9:వరదయ్యపాళెం మండలం లోని చిన్న పాండూరు, కంచరపాళెం, పాండూరు, తొండంబట్టు, అంబికాపురం, వరదయ్యపాళెం తదితర గ్రామాల్లో మంగళవారం ఆర్ఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఈవీఎంలపై అవగాహన కల్పించారు.

సిపాయి భరోసా అందజేత

ఏర్పేడు,జనవరి 9: ఏర్పేడు మండలం పల్లం పంచాయతీ పల్లంపేట హరిజనవాడలో మృతి చెందిన యానాది బోడయ్య కుటుంబాన్ని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మంగళవారం కలిశారు. బోడయ్య భార్య శంకరమ్మకు సిపాయి భరోసా కింద 40 నిత్యావసర సరుకులను అందజేశారు.డాక్టర్ బాబు, డాక్టర్ వెంకటాద్రి, డాక్టర్ శ్రీను, వైసీపీ నాయకులు యానాది రామకృష్ణయ్య, వెంకటయ్య,మూర్తి, వెంకయ్య, శంకరయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



శ్రీకాళహస్తి జనవరి 9: అయోధ్య శ్రీరామ అక్షింతల పంపిణీ వేడుకగా జరిగింది. పట్టణంలోని నెహ్రూ వీధిలో ఉన్న రామ మందిరంలో అయోధ్య నుంచి విచ్చేసిన అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీజేపీ నేత కోలా ఆనంద్ ఆధ్వర్యంలో రామనామ స్మరణతో అక్షింతలను చతుర్మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు పంపిణీ చేశారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు రమేష్ బాబు, మంగిరెడ్డి, శ్రీరామ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామి ప్రాకార ఉత్సవం

శ్రీకాళహస్తి, జనవరి 9: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు కాలభైరవ స్వామికి అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. కాలభైరవ స్వామి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం మీదుగా విజయ స్థూపం వరకు తీసుకువెళ్ళి అక్కడి నుంచి ప్రదక్షిణగా తిరిగి ఆలయంలో కొలువు తీర్చారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 9: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.మధ్యాహ్నం రాహుకాల సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. శ్రీకాళహస్తి పట్టణంతోపాటు పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

శ్రీకాళహస్తి జనవరి 9: మద్యం మత్తులో పలువురు యువకులు వీరంగం సృష్టించిన ఘటన మంగళవారం శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ వద్ద చోటుచేసుకుంది. ఓ స్నేహితుని కార్యం కోసం పట్టణానికి చెందిన కొందరు యువకులు ఎన్టీఆర్ నగర్ వద్ద కలుసుకున్నారు. మద్యం మత్తులో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుని పలువురు ఘర్షణకు దిగారు.. శ్రీకాళహస్తి పట్టణం మరాఠీ పాలునికి చెందిన మునిశేఖర్ పంక్చర్ దుకాణం నిర్వహిస్తుంటాడు. ఇందులో మునిశేఖర్ ముఖంపై మద్యం సీసాతో దాడి జరిగిందని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చేరాడు. భారీగా యువకులు ఆసుపత్రి వద్ద గుమిగూడారు. ఉద్రిక్త పరిస్థితులు ఎదురవకుండా పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని అదుపు చేశారు.



చికిత్స పొందుతున్న మునిశేఖర్

అగంతకుడి భయంలో గిరిజనులు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 9: బుచ్చినాయుడుకండ్రిగ ఈబీసీ కాలనీలోని గిరిజనులను అగంతకులు భయభ్రాంతులకు గురిచేశారు. కాలనీవాసుల సమాచారం మేరకు.... సోమవారం రాత్రి 11గంటల సమయంలో ఓ అగంతకుడు గిరిజనుల ఇళ్లకు వచ్చి తలుపు తట్టి భోజనం కావాలని అడిగాడు. ఆ ఇంట్లోని వ్యక్తి తలుపు తెరిచి ఈ సమయంలో భోజనం లేదని మందలించి పంపాడు. అతడు మరో ఇంటికి వెళ్లి తలుపులు గట్టిగా తట్టడంతో ఇంట్లోని మహిళలు భయభ్రాంతులకు గురై కేకలు వేయగా సమీపంలోని ఇండ్లవారంతా రావడంతో అగంతకుడు పారిపోయారు. స్థానికులు వెంబడించి పట్టుకుని ఆరా తీయగా తమిళనాడు అని ఒకసారి, సూళ్లూరుపేట అని మరోసారి పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ కాలనీలో తరచూ అగంతకులు తారసపడుతుండడంతో రాత్రి పూట పరిశ్రమలకు వెళ్లే వారు మహిళలను, పిల్లలను ఇంటి వద్ద వదలి వెళ్లడానికి ఆందోళన చెందుతున్నామని చెప్పారు.పోలీసులు స్పందించి కాలనీవాసులకు రక్షణ కల్పించాలన్నారు.



పట్టుబడ్డ అగంతకుడు



ఆందోళనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

అంగన్వాడీల ఆందోళన ఉధృతం

సత్యవేడు, జనవరి 9: సత్యవేడులో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం జైల్‌భరో కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి గంటపాటు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు. దీంతో పట్టణంలో ట్రాఫిక్ స్తంభించింది. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి ఆందోళన విరమించాలని కోరినా వినకపోవడంతో రాస్తారోకో నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు రమేష్, మునిరాజాతో పాటు, పలువురు అంగన్వాడీ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ వేలాదిమంది అంగన్వాడీ కార్యకర్తలు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోగా ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమన్నారు.డీవైఎఫ్ఐ నేత మురళి, బాషా, అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మల, భువన, సరళ, శాంతి, ఝాన్సీ, కాంతమ్మ, భారతి, నాగరాజు, మంజుల, చందామరి, విజయ, పార్వతి, అనురాధ, సుజాత, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరులో ఉద్రిక్తత

పిచ్చాటూరు, జనవరి 9: సజ్జల రామకృష్ణారెడ్డి సలహాలతో అంగన్వాడీలను అణగదొక్కాలని చూస్తే వైసీపీ తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని సీఐటీయూ నాయకుడు దాసరి జనార్దన్ హెచ్చరించారు. అంగన్వాడీలు మంగళవారం సమ్మెలో భాగంగా జైల్‌భరో నిర్వహించారు. సమ్మె శిబిరం నుంచి తిరుపతి-చెన్నై జాతీయ రహదారి బైపాస్ కూడలి వరకు ర్యాలీగా వెళ్లిన అంగన్వాడీలు ,సీఐటీయూ నాయకులు జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ట్రాఫిక్ స్తంభించిపోవడంతో యూనియన్ నాయకులను అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు ప్రయత్నించారు. దీంతో అంగన్వాడీలు పోలీసులపై తిరగబడ్డారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చివరకు ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆందోళనకారులకు సర్దిచెప్పడంతో ఉద్రిక్తత సమసింది.



పిచ్చాటూరు పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా

ముక్కంటి సేవలో జమ్మూ కాశ్మీర్ చీఫ్ జస్టిస్

శ్రీకాళహస్తి జనవరి 9: శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని జమ్మూ కాశ్మీర్ హైకోర్టు చీఫ్ జస్టిస్ తషి రబస్తన్ మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో పండితులు శేష వస్త్రంతో సత్కరించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్థానిక 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసులు నాయక్, శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి, జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.



ముక్కంటి ఆలయంలో న్యాయమూర్తులు

రైల్వేలో పాత పింఛను విధానం అమలుచేయాలి



సీఆర్ఎస్ వద్ద మజ్దూర్ యూనియన్ దీక్షలు

రేణిగుంట,జనవరి 9 : రైల్వేలో నూతన పించను విధానం రద్దు చేసి,పాత పింఛను విధానం అమలు చేయాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ సీఆర్ఎస్ వర్క్‌షాపు డివిజన్ సెక్రటరీ సురేంద్రరెడ్డి డిమాండ్ చేశారు. సీఆర్ఎస్ గేటుఎదుట మంగళవారం యూనియన్ రిలేదీక్షలను ఆయన ప్రారంభించారు. మంగళవారం నుంచి గురువారం వరకు రిలే దీక్షలు,ఆందోళనలు చేపట్టామన్నారు. బాబు,సదాశివరెడ్డి, హెడ్రిపాల్,ఉదయ్‌రాయ్,మునిరామయ్య,చంద్రశేఖర్,మునికుమార్,చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే టీచర్ల సమస్యలు పరిష్కారం

శ్రీకాళహస్తి జనవరి 9: పోరాటాలతోనే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించుకోగలమని రాష్ట్రోపాధ్యాయ సంఘం శ్రీకాళహస్తి డివిజన్ కన్వీనర్ గుమ్మడి మురళి అన్నారు. సంఘం 75వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ... ఈ నెల 12,13 తేదీల్లో కర్నూలులో వజ్రోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించుకోనున్నట్లు తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యువశ్రీ మురళి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

వరదరాజస్వామి ఆలయ పునఃనిర్మాణ పనుల్లో అపచారం

శ్రీకాళహస్తి జనవరి 9: ప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునఃనిర్మాణ పనుల్లో అపచారం జరుగుతున్నట్లు హిందూ ధార్మిక మండలి సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ముక్కంటి ఆలయ ఈవో రామారావును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రసన్న వరదరాజస్వామి ఆలయ శిథిలాలను పూర్తిగా తొలగించ లేదన్నారు. పాత వ్యర్థాలను పునాదుల్లో నింపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగమ నియమాలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.మండలి జిల్లా కన్వీనర్ సప్పిడి సుబ్బరామిరెడ్డి , శ్రీకాళహస్తి పట్టణ కన్వీనర్ గరికపాటి రమేష్ బాబు, సభ్యులు. బాలిశెట్టి చంద్రశేఖర్, వాసు యాదవ్, మోహన్ రావు, గిరి,ఢిల్లీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మయ్యకు ఘన నివాళి

శ్రీకాళహస్తి జనవరి 9: మాజీ కౌన్సిలర్ ధర్మయ్యకు పలువురు ఘనంగా నివాళులర్పించారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన వైసీపీ నాయకులు, కేబుల్ ఆపరేటర్స్ అధ్యక్షులు ధర్మయ్య మంగళవారం ఇంటి వద్ద మృతి చెందారు.మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ ఆయన కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. మాజీ కౌన్సిలర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంటలో అంగన్వాడీల ర్యాలీ

రేణిగుంట,జనవరి9: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించి, జీతాలు పెంచే వరకు ఆందోళనలు ఆపేది లేదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ధనమ్మ,రాధ హెచ్చరించారు.స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం జైల్‌భరో కార్యక్రమంలో బాగంగా రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుకు అడ్డంగా బైఠాయించిన వారిని పోలీసులు అదుపు లోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.మిగిలిన వారు తమనుకూడా అరెస్ట్ చేయాలని స్టేషన్‌వద్దకు రాగా అరెస్టు చేసిన వారిని వదిలి పెట్టారు. భాగ్యలక్ష్మి, అంబిక, ప్రభావతి, పార్వతి, ధరణి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై అంగన్వాడీలను అదుపులోకి తీసుకొంటున్న పోలీసులు

వైభవంగా ప్రదోష పూజలు



నందీశ్వరుడికి జరుగుతున్న అభిషేకాలు

నాగలాపురం, జనవరి 9: సురుటుపల్లి పల్లికొండేశ్వరాలయంలో మంగళవారం ప్రదోష పూజలు వైభవంగా జరిగాయి.ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్ ప్రదోష మండపంలోని నందీశ్వరుడికి అభిషేకాలు చేసి దీప, ధూప నైవేద్యాలు సమర్పించారు. స్వామివారిని అలంకరించి నక్షత్ర హారతి, కుంభహారతి, మహా హారతి చేపట్టారు.స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ ఆవరణలో ప్రాకారోత్సవం నిర్వహించారు.

పల్లికొండేశ్వరుడి హుండీ ఆదాయం రూ.5,89,417

పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో గత 66 రోజులకు సంబంధించి హుండీ లెక్కింపు మంగళవారం జరిగింది.ఈవో రామచంద్రారెడ్డి, ఛైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 5,89,417 రూపాయలు ఆలయానికి ఆదాయం వచ్చినట్లు జూనియర్ అసిస్టెంట్ శరవణ తెలిపారు. ఈ ఆదాయం ఆలయానికి వచ్చిన భక్తులు హుండీలో చెల్లించుకున్న కానుకలని తెలిపారు.దేవదాయశాఖ తిరుపతి డివిజన్ ఇన్‌స్పెక్టర్ పనిరాజశయన తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

ఏర్పేడు, జనవరి 9: అప్పుల బాధ తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం ఏర్పేడు మండలంలో చోటు చేసుకుంది.ఎస్ఐ జిలానీ కథనం మేరకు...రావిళ్లవారికండ్రిగ గిరిజన కాలనీకి చెందిన రాణెమ్మ(44) రూ.లక్ష వరకు రైతుల వద్ద ఏడాది క్రితం అప్పు చేసింది. అప్పు తీర్చలేని పరిస్థితుల్లో మూడు నెలలుగా మానసికంగా కుంగిపోయింది. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో ఇనుపకమ్మికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.ఇరుగుపొరుగు వారు గమనించి ఆమె కుమారుడు సుబ్రహ్మణ్యానికి సమాచారమిచ్చారు. ఆయన ఇంటికి చేరుకుని రాణెమ్మ మృతదేహాన్ని కిందకు దించి పోలీసులకు సమాచారమిచ్చారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రాణెమ్మ(పాతచిత్రం)

రామాపురంలో ఆరోగ్యసురక్ష

పిచ్చాటూరు, జనవరి 9: మండలంలోని రామాపురంలో మంగళవారం రెండవ దశ ఆరోగ్యసురక్ష కార్యక్రమం జరిగింది. వైద్యాధికారి హమీద్ సిబ్బందితో కలసి ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణకు తగిన శాంపిల్స్‌ని సేకరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అధికార పార్టీ నాయకులు అనంతరం పులికుండ్రం గ్రామంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొని క్రీడాకారులకు జెర్సీలను పంపిణీ చేశారు. వైసీపీ మండల అధ్యక్షుడు చలపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి భాస్కర్‌నాయుడు, ఎంపీటీసీ రమేష్‌రాజు, సర్పంచ్ సతీష్‌రాజు, కిరణ్‌కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

అప్పుల్లో ఫస్ట్... అభివృద్ధిలో లాస్ట్: నెలవల


కరపత్రాలు అందజేస్తున్న మాజీ ఎంపీ నెలవల

తడ, జనవరి 9: ఆంధ్రప్రదేశ్ అప్పుల్లో మొదటిస్థానంలో ఉండగా, అభివృద్ధిలో చివరిస్థానంలో నిలిపిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఎద్దేవా చేశారు. మంగళవారం తడలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో రూ.12 లక్షల కోట్ల అప్పులు చేశారని తెలిపారు. సంక్షేమ పథకాల కింద రూ.2 లక్షల కోట్లు ప్రజలకు పంచామని చెబుతున్న ప్రభుత్వం, మిగిలిన రూ.10లక్షల కోట్లు ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని దివాళా తీయించిన జగన్‌కు మరోసారి అధికారం అప్పగిస్తే అధోగతి పాలవడం ఖాయమన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్, నాయకులు కామిరెడ్డి మురళీరెడ్డి, సెల్వం, నీలకంఠం, శివాజీ, రామమూర్తి, రమేష్ పాల్గొన్నారు.

కోట ఆస్పత్రి అదనపు భవనం ప్రారంభం


ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

కోట, జనవరి 9: కోటలోని ప్రభుతాస్పత్రి ప్రాంగణంలో నిర్మించిన అదనపు భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు లాంఛనంగా ప్రారంభించారు. రూ.1.93 కోట్ల నాబార్డ్ నిధులతో ఆస్పత్రి అదనపు భవన నిర్మాణాన్ని ఆరు నెలల క్రితమే పూర్తయింది. అప్పట్లోనే భవనాన్ని ప్రారంభించాలనుకున్నా ఆగిపోయింది. దీంతో ఆస్పత్రి సిబ్బంది కొత్తగా నిర్మించిన భవనంలోకి చేరిపోయి విధులు నిర్వహిస్తున్నారు. అక్కడే ఆపరేషన్లు, రోగులకు చికిత్స అందిస్తున్నారు. మంగవారం ఎమ్మెల్యే వరప్రసాద్ విచ్చేసి అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో లాంఛనంగా భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో భవానీ, ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ రూప, డాక్టర్ డోమ్‌ప్రియరావు, ఎంపీటీసీ మోబిన్‌బాషా, గురుస్వామి, ప్రసాద్, సర్పంచు వెంకటరమణమ్మ, వైసీపీ మండల కన్వీనర్ సంపత్‌కుమార్‌రెడ్డి, యువజన విభాగం నాయకులు సాయిప్రసాద్‌రెడ్డి, హరిచంద్రారెడ్డి, ప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ రైతులకు అవగాహన సదస్సు

గూడూరు, జనవరి 9: మండలంలోని పారిచెర్ల గ్రామంలో మంగళవారం నెల్లూరుకు చెందిన వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో నిమ్మ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ పీడీ సత్యవాణి మాట్లాడుతూ నిమ్మచెట్లకు హైడ్రోజెల్ వినియోగించడం వల్ల మొక్కలకు తక్కువ నీటి తడులు అవసరమవుతాయన్నారు. కరువు సమయంలో నీటి ఎద్దడిని మొక్కలు తట్టుకుంటాయన్నారు. అనంతరం రైతులకు హైడ్రోజెల్‌ను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో డీపీడీ శివన్నారాయణ, కార్తీక్, శివ, రైతులు పాల్గొన్నారు.

సూక్ష్మధాతు లోపాల నివారణపై అవగాహన

వెంకటగిరి, జూన్ 9: వెంకటగిరి మండలంలోని నిమ్మ, చీని పరిశోధనా కేంద్రంలో మంగళవారం నిమ్మ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర అధిపతి మధుమతి ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు నిమ్మలో సూక్ష్మధాతు లోపాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. సూక్ష్మధాతు మిశ్రమం తయారు చేసే విధానం, తయారు చేసిన మిశ్రమాన్ని నిమ్మ చెట్లపై పిచికారీ చేయడంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యాన కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన

పెళ్లకూరు, జనవరి 9: ఈవీఎంల వినియోగంపై పెళ్లకూరు సచివాలయంలో మంగళవారం అవగాహన కార్యక్రమం తహసీల్దార్ రామయ్య పాల్గొని ఈవీఎంల వినియోగం, వాటి పనితీరు గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ సంతోషీబాయి తదితరులు పాల్గొన్నారు.

రెండు మోటారు సైకిళ్ల ఢీ
ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

నాయుడుపేట టౌన్, జనవరి 9: నాయుడుపేట - మేనకూరు సెజ్ సమీపంలో రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఓజిలి మండలం మనవాలి గ్రామానికి చెందిన సుబ్బరామయ్య, మల్లికార్జున్ మోటారు సైకిల్‌పై మేనకూరు నుంచి మంగళవారం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్బరామయ్య(64) మృతి చెందగా, మల్లికార్జున్, పెంచలయ్యకు గాయాలయ్యాయి. సుబ్బరామయ్య మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న స్పోర్ట్స్ మీట్

వెంకటగిరిటౌన్, జనవరి 9: మండల పరిధిలోని బెటాలియన్‌లో స్పోర్ట్స్ మీట్ కొనసాగుతోంది. మంగళవారం జరిగిన కార్యక్రమంలో కర్నూలు రేంజీ డీఐజీ-3 సీహెచ్ వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పోలీసులకు 100 మీటర్లు, 400మీటర్లు రిలే, కబడ్డీ, షటిల్, మ్యూజికల్ చైర్స్ చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కమాండెంట్ ప్రకాష్, అసిస్టెంట్ కమాండెంట్ ఎంఎల్ మనోహర్, ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు గడువు పొడిగింపు

నాయుడుపేట, జనవరి 9: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి జనవరి 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కళాశాల అధ్యయన కేంద్ర కోఆర్డినేటర్ జి. వెంకటరామిరెడ్డి మంగళవారం తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కోట, జనవరి 9: విధి నిర్వహణలో వీవోఏలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏపీఎం రత్నయ్య హెచ్చరించారు. కోటలోని వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో మంగళవారం వీవోఏలకు లక్‌పత్ దిది యాప్‌పై శిక్షణ జరిగింది. ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని అందులో నుంచి వచ్చే కేంద్ర ప్రభుత్వ పథకాలను పొదుపు సంఘాలకు వివరించాలన్నారు. సమావేశంలో స్త్రీనిధి మేనేజర్ జయకర్‌బాబు, సీసీలు శ్రీకాంత్, కృష్ణమ్మ, భాస్కర్, ప్రసాద్, శంకర్, కృష్ణ పాల్గొన్నారు.

ఎస్మా చట్టాన్ని ఉపసంహరించుకోండి



నాయుడుపేటలో రోడ్డుపై బైఠాయించిన అంగన్వాడీ, సీఐటీయూ నాయకులు - కోట పట్టణంలో ర్యాలీ

గూడూరు, జనవరి 9: రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలపై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద మంగళవారం అంగన్వాడీ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 29వ రోజు కొనసాగింది. దీక్షలో పాల్గొన్న అంగన్‌వాడీలు ప్రదర్శనగా టవర్‌క్లాక్ సెంటర్‌కు చేరుకుని మానవహారం ఏర్పాటు చేసి రాస్తారోకో నిర్వహించారు. వీరికి సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు మద్దతుగా నిలిచారు. వాహనాల రాకపోకలను నిలిపి వేసి సీఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోవడంతో సీఐ హజరత్‌బాబు, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడిచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతుంటే పరిష్కరించకుండా అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని అమలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీ.రమణయ్య, సురేష్, ప్రసాద్, మణి, శశికుమార్, చంద్రయ్య, గోపీనాథ్, రమణయ్య, శ్రీనివాసులు, ఇంద్రావతి, ప్రభావతి, పెంచలమ్మ, లక్ష్మి, మణికుమారి పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: తమ డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు ఇన్నాళ్లు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా బెదిరించడం దుర్మార్గమని ఆ యూనియన్ నాయకురాలు హైమావతి అన్నారు. సమ్మెలో భాగంగా మంళవారం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వీరికి సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు.

నాయుడుపేట టౌన్: వైసీపీ పాలనకు చరమగీతం పాడాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు చాపల వెంకటేశ్వర్లు అన్నారు. జైలు భరో కార్యక్రమం సందర్భంగా మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు, పారిశుధ్య కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. నాయుడుపేట - పూతలపట్టు రహదారిపై బైఠాయించడంతో దాదాపు కిలోమీటరు మేర వాహనాలు ఆగిపోయాయి. ఎస్ఐ రఘునాథ్ సంఘటనాస్థలాన్ని చేరుకొని సీఐటీయు నాయకులు వెంకటేశ్వర్లు, ముకుంద, అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం పూచికత్తుమీద వారిని విడుదల చేశారు.

వెంకటగిరి: సమస్యల సాధన కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు కలిసి రాపూరు క్రాస్‌రోడ్డు వద్ద మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. పోలీసులు అక్కడికి చేరుకుని కార్మిక నాయకులను అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచికత్తుపై వదిలి పెట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, అంగన్వాడీ యూనియన్ నేతలు మంజుల, సుభాషిణి, శామల, ఉమా, జోతి, ఐఎఫ్‌టీయూ నాయకులు అన్నపూర్ణ, సుప్రియ, గీతావాణి, నిర్మల, మల్లీశ్వరి, నాయకులు భాస్కర్, సుబ్బరాయలు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోట: పట్టణంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు వినూత్న రీతిలో మంగళవారం నిరసన తెలిపారు. కోటలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నుంచి కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పట్టణంలోని గోపాల్‌రెడ్డి విగ్రహం మీదుగా బజారుసెంటర్‌లోని గాంధీబొమ్మ సెంటర్‌కు చేరుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడ మానవహారం చేసి సీఎం జగన్‌కు మంచి మనస్సు ప్రసాదించాలంటూ దేవుడిని ప్రార్థించారు. అక్కడ నుంచి దీక్షా శిబిరానికి చేరుకొని నిరసన కార్యక్రమాలు చేపట్టారు.


గూడూరు టవర్‌క్లాక్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహిస్తున్న అంగన్వాడీలు

చంద్రబాబుతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి



ఏర్పేడు. జనవరి 9: చంద్రబాబుతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి సాధ్యమని శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుధీర్‌రెడ్డి అన్నారు. ఏర్పేడు మండలం పెనగడం, చెన్నంపల్లి గ్రామాల్లో మంగళవారం ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకులు పేరం ధనంజయులు నాయుడు, మల్లికార్జున నాయుడు,సుందరబాబు, ఏకాంబరం, నాగరాజు నాయుడు, గిరి నాయుడు, చెంచయ్య, మనోహర్ నాయుడు, రవిరెడ్డి, నాగమణిరెడ్డి, కృష్ణారెడ్డి, రోశయ్య, కేశినేని సుబ్రహ్మణ్యం, గణేష్‌నాయుడు, మునిరామయ్య, రవి నాయుడు, రమేష్, దొరస్వామి, సీతాపతి ఆచారి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ఏర్పేడు, జనవరి 9: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అమలు పరుస్తున్న కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ సూచించారు. ఏర్పేడు మండలం మాధవమాల గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.బీజేపీ నాయకులు మునిసుబ్రహ్మణ్యం, మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, గోపాల్, రమణారెడ్డి, ఎస్వీ రమణప్రసాద్, వెంకటసుబ్బయ్య, దామోదరం, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిర్బంధం దారుణం

కేవీబీపురం జనవరి9: యూటీఎఫ్ పిలుపు మేరకు విజయవాడలో ధర్నాకు వెళ్ళిన కేవీబీపురం మండలానికి చెందిన యూటీఎఫ్ నాయకులను నిర్బంధించడం దారుణమని యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శులు హేమాంబరధరరావు, పురుషోత్తం విమర్శించారు.

రాష్ట్రం బాగుపడాలంటే టీడీపీ అధికారంలోకి రావాలి

నాగలాపురం, జనవరి 9: సీఎం జగన్ అసమర్థ పాలనతో అన్ని రంగాల్లోనూ వెనకబడ్డ రాష్ట్రం మళ్ళీ అభివృద్ధి గాడిలో పడాలంటే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హెలెన్ పేర్కొన్నారు. మంగళవారం కారణిలో హెలెన్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆమె ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంచుతూ టీడీపీ - జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస యాదవ్, జనసేన మండల అధ్యక్షుడు మణికంఠ, జిల్లాకార్యదర్శి హేమకుమార్, టీడీపీ నాయకులు పార్తీబన్, ఎండీ కుమార్, రుద్రయ్య, దేవానందం, నెల్సన్ మండేలా తదితరులు పాల్గొన్నారు.


కారణిలో ప్రచారం నిర్వహిస్తున్న హెలెన్

రేణిగుంటలో విద్యుత్ అదాలత్



రేణిగుంట, జనవరి 9 :విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అదాలత్ లాంటి అవకాశాలను ఉపయోగించుకోవచ్చునని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్‌పర్సన్ వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి వెల్లడించారు.రేణిగుంట ఎఫ్‌సీఐ గిడ్డంగుల వద్ద వున్న రూరల్ విద్యుత్ సెక్షన్ కార్యాలయం వద్ద మంగళవారం విద్యుత్ అదాలత్ నిర్వహించారు.పలువురు వినియోగదారులు తమ సమస్యలను వివరించారు. విద్యుత్ సంస్థ నిబంధనల మేరకు రికార్డులు పొందుపరచి సమస్యలు పరిష్కరించుకోవచ్చునని సూచించారు.భూవివాదాలు ఈ అదాలత్‌లో పరిష్కరించలేమన్నారు.పేర్లు మార్చుకోవ లసిన వారు ముందు ఆస్తి రికార్డులు మార్చుకొని, అనంతరం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదాలత్ సభ్యులు కె.రామమోహన రావు,ఎస్ఎల్ అంజనీ కుమార్,జి. ఈశ్వరమ్మ, ఈఈ కె.వాసుదేవరెడ్డితో పాటు ఎస్ఏవో శ్రీనివాసులు,డీఈఈ ప్రభాకర్,ఏఏవో టి. జయరాం,ఏఈలు టి.మోహన్, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



సత్యవేడు, జనవరి 9: ఆక్రమిత భూమిలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. సత్యవేడు మండలంలోని పేరడం గ్రామంలో సర్వే నెం. 193,194లో ఎకరా ప్రభుత్వ భూమిని గ్రామంలోని కొందరు వారం రోజుల కిందట ఆక్రమించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఈ విషయంపై తహసీల్దార్ జరీనాబేగంకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ సిబ్బంది ఆ స్థలంలో మంగళవారం ప్రభుత్వ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

బాధ్యతగా పనిచేస్తే విజయం మనదే: భాను


నాయకులతో మాట్లాడుతున్న భానుప్రకాష్

వడమాలపేట, జనవరి 9: నాయకులు, కార్యకర్తలు బాధ్యత పనిచేస్తే టీడీపీ విజయం ఖాయమని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ అన్నారు. మంగళవారం నగరిలోని టీడీపీ కార్యాలయంలో వడమాలపేట పంచాయతీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ ప్రభంజనం వీస్తోందని, నగరి నియోజకవర్గంలో టీడీపీకి పూర్వ వైభవం రావడానికి నాయకులు అవిశ్రాంతంగా కృషి చేయాలని కోరారు. ఇప్పటికే వైసీపీ ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజలు విసిగిపోయారని, టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించి ఓటర్లలో మార్పు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామకమిటీ అధ్యక్షుడు ఢిల్లీ ప్రసాద్, నాయకులు గురునాథం శెట్టి, శివరాయల్, ధనలక్ష్మి, రాధాకృష్ణ, హేమంత్, విష్ణు, శివ, సాయి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల కార్యవర్గం ఎన్నిక


పీఆర్‌టీయూ నూతన కార్యవర్గ సభ్యులు

నారాయణవనం, జనవరి 9: మండలంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్(పీఆర్‌టీయూ) మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడుగా సుబ్బరాయులు, అధ్యక్షుడుగా ప్రసాద్, కార్యదర్శిగా జానికీరామన్, మహిళా అధ్యక్షరాలుగా పర్వీన్ బేగం, మహిళా కార్యదర్శిగా జీవితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి జోగి గురుమూర్తి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సులోచన, పీఆర్‌టీయూ నేతలు కోటీశ్వర్ రెడ్డి, జయప్రకాష్, లోకనాథం, సురేష్, అల్లెమ్మ, జీవ, గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

నేడు కొత్త తిమ్మాపురంలో ఆరోగ్య సురక్ష

పుత్తూరు అర్బన్, జనవరి 9: పట్టణ పరిధిలోని పల్లూరు సచివాలయం, కొత్త తిమ్మాపురం ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి తెలిపారు. గైనకాలజిస్ట్, పీడియాట్రిక్, జనరల్ మెడిసిన్, డెంటిస్ట్, ఆప్తమాలజిస్ట్ హాజరై రోగులను పరీక్షించి ఉచితంగా మందులను సైతం పంపిణీ చేస్తారని తెలిపారు.

నేటి నుంచి మండలస్థాయి పోటీలు

పుత్తూరు అర్బన్, జనవరి 9: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా బుధవారం నుంచి మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి తెలిపారు. పట్టణ, గ్రామీణ స్థాయి పోటీల విజేతలకు పట్టణంలోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, గేటుపుత్తూరులోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల మైదానాల్లో మండలస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

'మంత్రి రోజా, సీఎం జగన్ నాన్ లోకల్'

పుత్తూరు అర్బన్, జనవరి 9: మంత్రి రోజా, సీఎం జగన్ నాన్ లోకల్ అని ఐటీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాలి గోపీనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి రోజా చంద్రబాబును ఉద్దేశించి నాన్ లోకల్‌గా పేర్కొనడాన్ని ఆయన ఆక్షేపించారు. నారావారిపల్లెలో చంద్రబాబునాయుడికి సొంత ఇల్లు ఉండగా నాన్ లోకల్ ఎలా అవుతారని ప్రశ్నించారు. ఇకనైనా మంత్రి రోజా సహేతుకమైన విమర్శలు చేయాలని హితవుపలికారు.

పులివర్తి నానీకి పరామర్శ

వడమాలపేట, జనవరి 9: తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న చంద్రగిరి టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నానీని ఆ వడమాలపేట మండల నాయకులు మంగళవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతనిధి చినబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి, ఎస్‌బీఆర్ పురం సర్పంచు మణిరాజు, ఉప సర్పంచు రవి, శ్యామయ్య ఉన్నారు.


పులివర్తి నానీని పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

వేతనాలైనా పెంచండి... జైలుకైనా పంపండి



అంబేడ్కర్ సర్కిల్ వద్ద అంగన్వాడీ, మున్సిపల్ కార్మికుల రాస్తారోకో - మున్సిపల్ కార్మికుల భిక్షాటన

పుత్తూరు అర్బన్, జనవరి 9: వేతనాలైనా పెంచండి... లేకపోతే జైలుకైనా పంపండని అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు స్పష్టం చేశారు. మంగళవారం సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులు పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, ఏఐటీయూసీ పట్టణ గౌరవాధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ 29 రోజులుగా ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తల డిమాండ్లు పరిష్కరించకపోగా ఎస్మా ప్రయోగించేందుకు ప్రభుత్వం సిద్ధపడడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల ముందు ఊరూరా తిరుగుతూ అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచుతామని సీఎం జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరడం చట్ట ఉల్లంఘన అవుతుందా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తూ కార్మికులు చేస్తున్న ఉద్యమాన్ని పోలీసులతో అణచివేసేందుకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం ఎన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేసినా, బెదిరింపులకు పాల్పడినా నెరవబోమని వేతనాలను పెంచితేనే కార్మికులు విధులకు హాజరవుతారని తేల్చి చెప్పారు. అప్పటి వరకు సమ్మెను కొనసాగించడమే కాకుండా మరింత ఉధృతం చేస్తామని చెప్పారు. రాస్తారోకో చేస్తున్న నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. సొంత పూచికత్తుపై విడుదల చేశారు. అనంతరం అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు పట్టణంలోని మెయిన్‌రోడ్డు, కేఎన్ రోడ్డు, బజారువీధి మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పురుషోత్తం, అంగన్వాడీ యూనియన్ నాయకులు మునికుమారి, విజయకుమారి, ఏఐటీయూసీ నాయకులు గోపి, విజయ్‌కుమార్, గణేష్, యాకోబ్, దళిత, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల భిక్షాటన

సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్మికులు మంగళవారం పట్టణంలో భిక్షాటన చేస్తూ నినాదాలు చేశారు. ఏఐటీయూసీ పట్టణ గౌరవాధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల సందర్భంగా వేతనాల పెంపుపై సీఎం జగన్ ఇచ్చిన హామీని ప్రభుత్వం చివరి రోజుల్లోనైనా అమలు చేయాలని కోరారు. నాలుగున్నరేళ్లగా కార్మికులు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జగన్ ప్రభుత్వాన్ని నమ్ముకుని చివరికి భిక్షాటన చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లు పరిష్కారానికి ముందుకు రావాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గోపి, వర్కర్స్ యూనియన్ నాయకులు గణేష్ కుమార్, చందు, భారతి, మణి, విజయ్‌కుమార్, యాకోబు, అంకయ్య, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్‌కు సొంత భవనం ప్రశంసనీయం

పుత్తూరు, జనవరి 9: వాకర్స్ అసోసియేషన్ సభ్యులందరూ కలిసి స్వశక్తితో సొంత భవనం నిర్మించుకోవడం ప్రశంసనీయమని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు మురళీమోహన్ రావు అన్నారు. పుత్తూరులోని వాకర్స్ అసోసియేషన్ భవనాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసోసియేషన్ నియమావళి మేరకు ప్రతి కార్యక్రమానికి సంబంధించిన వివరాలు ఇంటర్నేషనల్ కార్యాలయానికి పంపితే, ఆ మేరకు అవార్డులు, రివార్డులను అందిస్తామని తెలిపారు. అసోసియేషన్ పని తీరు పట్ల సంతృప్తిచెంది రూ.పదివేలు వ్యక్తిగతంగా ఇస్తున్నానని ప్రకటించారు. వైద్యశిబిరాలు, రక్తదాన శిబిరాల నిర్వహణకు కేంద్ర అసోసియేషన్ నుంచి రూ.30 వేలు అందిస్తున్నామని ఇంటర్నేషనల్ అసోసియేషన్ కార్యదర్శి ప్రదీప్‌కుమార్ ప్రకటించారు. అనంతరం ఇంటర్నేషనల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించారు. కార్యక్రమంలో పుత్తూరు అసోసియేషన్ వ్యవస్థాకక అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ రవిరాజు, గవర్నర్ మాధవనాయుడు, ప్రాంతీయ ఉపాధ్యక్షుడు కోనేటి రవిరాజు, పుత్తూరు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేఎల్ఎన్ మూర్తి, మునికృష్ణయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మురళీమోహన్ రావు